జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 47 | సంచిక : 21 | విజయవాడ | 5-3-2015 | పేజీలు : 8 | వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

- క్యూబా : సంబంధాల సాధారణీకరణకు జాతీయ స్వాతంత్ర్యాన్ని గౌరవించాలి
- అమెరికా పాలకుల క్రూరమైన నేర చరిత్ర
- టిసిఎస్ ఉద్యోగులను ఊబిలోకి నెట్టివేసిన యాజమాన్యం
- నూతన రోడ్డు రవాణా భద్రతా బిల్లు - 2014
- పెరుగుతున్న సేద్యపు ఖర్చులు - రుణాల ఊబిలో రైతులు
- ప్రదర్శనాత్మక చర్యలతో 'మహిళా శక్తి' పేరిట వంచన
- పేదరికం, అసమానత్వాలే మూఢనమ్మకాల్ని పెంపొందించే కారణాలు

నిబద్ధ కమ్యూనిస్టులకు విప్లవ నివాళులు

కామ్రేడ్ షబ్బర్ హుస్సేన్



విప్లవానికే అంకితమైన కామ్రేడ్ షబ్బర్‌హుస్సేన్ మరణం ఉత్తరప్రదేశ్ పార్టీనిర్మాణానికి, మొత్తంగా దేశంలోని ప్రజాఉద్యమాలకూ తీరనిలోటు. 2014 నవంబర్ 15న లక్నోలో తీవ్ర అనారోగ్య కారణంగా ఆయన మరణించారు. సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి దివంగత నాయకునికి విప్లవ జోహార్లర్పిస్తోంది.

కామ్రేడ్ షబ్బర్ హుస్సేన్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం - బారాబంకీ జిల్లాలో ఓ ఫ్యూడల్ నవాబుల కుటుంబంలో 1934లో జన్మించారు. విద్యార్థిగా వున్న కాలంలోనే ఆయన మార్క్సిజం భావజాలాన్ని స్వీకరించారు. బారాబంకీ, లక్నో ప్రాంతాలలో ఫ్యూడల్ వ్యతిరేక పోరాటమంటే నవాబులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటమే. నవాబులకు వ్యతిరేకంగా కా॥ షబ్బర్ హుస్సేన్ పీడితప్రజల తరపున నిలచి, వారి ప్రేమాభిమానాలను చూరగొని పీడిత ప్రజాఉద్యమ నాయకునిగా ఎదిగారు. ఫ్యూడల్ అణచివేత, దోపిడీ-పీడనలకు వ్యతిరేకంగా రైతాంగ సమస్యలపై ఆయన అనేక మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారు. 18-12-2014న లక్నోలో జరిగిన ఆయన సంస్మరణసభకు పెద్దసంఖ్యలో హాజరైన రైతాంగం, చిన్న వ్యాపారులు, మేధావులను గమనించినపుడు ఆయన ఎంతగా వారి ప్రేమాభిమానాలను చూరగొన్నారో అర్ధమవుతుంది.

ఆయనను ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని కోరిన ఆయన జీవిత భాగస్వామి ఇష్రాత్ జహాన్ బేగంకు ఆయన ముందుగానే తాను ఎంచుకున్న జీవిత పంథాను గురించి, ఆ కారణంగా ఎదుర్కోబోయే ఇబ్బందులు, కష్టాల గురించి వివరించి, వానిని తట్టుకునేందుకు సిద్ధమవుతేనే తాను అంగీకరించగలనని చెప్పి ఆవిధంగా ఆమె అంగీకారంతో పెళ్ళిచేసుకున్నాడు. ఆమె ప్రకటించిన విధంగానే, ఆయన జీవిత భాగస్వామిగా వుంటూ చిన్న ఉద్యోగం చేసుకుంటూ మాటకు కట్టుబడివుంది. కా॥ షబ్బర్‌జీ రాజకీయ, ఉద్యమ జీవితం కారణంగా ఎదురైన కష్టనష్టాలన్నింటినీ తట్టుకుంది. ఆయన మరణానికి కొద్దినెలల ముందే ఆమె కూడా కన్నుమూశారు.

కామ్రేడ్ షబ్బర్‌జీ ఆ ప్రాంతంలో డాక్టర్‌గా కూడా ప్రసిద్ధుడు. ఎమ్.ఏ. ఉత్తీర్ణుడైన పిదప, ప్రజలకు తోడ్పడుతుందనే దృష్టితో హోమియోవైద్యంలో డిప్లొమా కోర్సును పూర్తిచేసిన షబ్బర్‌జీ చివరి వరకూ ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తూ వచ్చారు. ఆయన మంచంచుట్టూతా రోగులకివ్వటానికి కొన్ని వందల హోమియో మందుల సీసాలుండేవి.

కామ్రేడ్ షబ్బర్‌జీ నిఖార్సయిన నిస్వార్ధజీవనం గడిపారు. శ్రమజీవుల కష్టాలు, బాధలపట్ల ఆయన తీవ్రంగా స్పందించేవారు; ఆవేదన చెందేవారు. ఒక ప్రమాదంలో ఆయన కాలుకి ఆపరేషన్ జరిగి, నడవటం ఆయనకు ఇబ్బందిగా వున్నప్పటికీ దానిని లక్ష్యపెట్టక పార్టీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయన ఎంతదూరమైనా బాధను ఓర్చుకొని ప్రయాణించేవారు. అనారోగ్యంతో వుండి పార్టీ కమిటీ సమావేశాలకు హాజరై కూడా క్రియాశీలకపాత్ర నిర్వహించేవారు.

కా॥ షబ్బర్‌జీ 1958లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరి, 1960 నాటికి బారాబంకీ జిల్లాకమిటీ సభ్యునిగా వున్నారు. శివకుమార్ మిశ్రా నాయకత్వంలో సిపిఐలో సాగిన ఆంతరంగిక సిద్ధాంత, రాజకీయ పోరాటంలో ఆయన ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించి, సిపిఎంలో చేరారు. ఆపై సిపిఎం రాజకీయాలతో విభేధించి 1968-69లో చారుమజుందార్ నాయకత్వంలోని ఏఐసిసిసిఆర్‌లోను, ఆ పిదప సిపిఐ(ఎం-ఎల్)లోనూ చేరారు. కొద్దినెలలలోనే చారుమజుందార్ అతివాద దుస్సాహసిక పంథాను ఆయన తిరస్కరించారు. ఆపై కామ్రేడ్ కానుసన్యాల్ నాయకత్వంలోని ఓసిసిఆర్‌లోను, సిఓఐ(ఎం-ఎల్)లోను కేంద్రకమిటి సభ్యునిగా కొనసాగారు. 2005లో సిపిఐ(ఎం-ఎల్) ఏర్పడినప్పటినుండీ తుదివరకూ ఆయన కేంద్రకమిటి సభ్యునిగా కొనసాగారు.

కా॥షబ్బర్ హుస్సేన్ ఇండియా-పాకిస్థాన్ యుద్ధ సమయంలో 1964లోనూ, గుజరాత్ ఆందోళనల నేపథ్యంలో 1974లోనూ రెండు పర్యాయాలు అరెస్టు అయ్యారు. 'ఇండో-చైనా ఫ్రెండ్‌షిప్' బృందంలో సభ్యునిగా కా॥షబ్బర్‌జీ 1989లో మూడునెలలపాటు చైనాలో పర్యటించారు.

నిబద్ధ కమ్యూనిస్టుగా కడదాకా జీవించిన కామ్రేడ్ షబ్బర్ హుస్సేన్‌కు విప్లవ నివాళులర్పిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

జోహార్ కామ్రేడ్ షబ్బర్‌హుస్సేన్!

సిపిఐ(ఎం-ఎల్)
కేంద్రకమిటి

కామ్రేడ్ అసిత్ సిన్హా

2015 జనవరి 31న సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి సభ్యులు కామ్రేడ్ అసిత్ సిన్హా మెదడు సంబంధిత పక్షవాతం కారణంగా కోల్‌కతాలో మరణించారు.

కామ్రేడ్ అసిత్ సిన్హా మరణం పశ్చిమబెంగాల్ విప్లవోద్యమానికేగాక, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు. మార్క్సిజం - లెనినిజం పట్ల సడలని ఆయన అంకితభావం, ఆయన నిరాడంబర జీవనం మరియు అతి, మితవాదాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన అవిశ్రాంత పోరాటాలు మనకు ఎల్లవేళలా స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. ఆయన మృతిపట్ల సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోంది. ఆయనకు విప్లవ జోహార్లర్పిస్తోంది. జీవిత చరమాంకంలో ఆయన బాగోగులను చూసిన కుటుంబసభ్యులకు తీవ్ర సంతాపాన్ని తెలియబరుస్తోంది.

ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని ఆనాటి అవిభాజ్య బెంగాల్‌లో - ఢాకా జిల్లాలోని, నవాబ్‌గంజ్ సబ్‌డివిజన్‌లో గాలింపూర్ గ్రామంలో 1939 అక్టోబర్‌లో కామ్రేడ్ అసిత్‌సిన్హా జన్మించారు. మధ్యతరహా భూస్వాములైన ఆయన కుటుంబం అధికారమార్పిడి తర్వాత పశ్చిమబెంగాల్ రాష్ట్రం - అసన్‌సోల్‌కు దగ్గరలోని కుల్టి పట్టణానికి వలస వచ్చారు. కామ్రేడ్ అసిత్ సిన్హా తన పాఠశాల విద్య పూర్తయిన తర్వాత, 1956లో కలకత్తాలోని గురుదాస్ కళాశాలలో చేరారు. కళాశాల నుండి పట్టభద్రుడైన తర్వాత న్యాయశాస్త్ర విద్య నభ్యసించేందుకు కలకత్తా విశ్వవిద్యాలయంలో చేరారు. గురుదాస్ కళాశాలలో చదువుతున్న రోజులలోనే 'బెంగాల్ ప్రొవెన్షియల్ స్టూడెంట్స్ ఫెడరేషన్' (బిపిఎస్ఎఫ్)లో చేరి, విద్యార్థి ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు.

కలకత్తా విశ్వవిద్యాలయంలో బిపిఎస్ఎఫ్ ముఖ్యనాయకులలో ఆయన ఒకరుగా వున్నారు. 1959 నాటికి ఆయన సిపిఐలో సభ్యులయ్యారు. సిపిఐ(ఎం) ఏర్పడిన తర్వాత ఆయన అందులో జేరి బిపిఎస్ఎఫ్ నాయకునిగా తన కార్యక్రమాలను కొనసాగించారు. భారత-పాకిస్థాన్ యుద్ధం సందర్భంగా పిడి చట్టం క్రింద ఆయనను ఒక సంవత్సరంపాటు జైలు నిర్బంధంలో వుంచారు. నయా రివిజనిజానికి వ్యతిరేకంగా సాగిన పార్టీ ఆంతరంగిక పోరాటంలో ఆయన విప్లవపంథావైపు నిలిచారు. ఏఐసిసిసిఆర్‌లో చేరి, వృత్తి విప్లవకారునిగా గ్రామీణ ప్రాంతాలలో పనిచేసేందుకు ఆయన కలకత్తాను వీడి వెళ్ళారు. 1969 మే నెలలో కలకత్తా మైదాన్‌లో జరిగిన సిపిఐ(ఎం-ఎల్) ఏర్పాటు సభ సన్నాహక కృషిలో ఆయన ఎంతో విప్లవదీక్షతో ప్రముఖపాత్ర నిర్వహించారు. అయితే, సిపిఐ(ఎం-ఎల్)లో వ్యక్తమైన అతివాద ఒంటెత్తువాద విధానానికి వ్యతిరేకంగా-కొద్ది నెలల కాలవ్యవధిలోనే దానికి వ్యతిరేకంగా పోరాడటంలో ఆయన అంతే విప్లవదీక్షతో ఖచ్చితంగా నిలిచారు. ప్రజాఉద్యమాలకు అతివాదం కలిగించే హాని పట్ల ఆయన కడదాకా మెలకువతో వ్యవహరించారు.

కామ్రేడ్ అసిత్‌సిన్హా 1970లో అరెస్టు కాబడి 1977లో విడుదలయ్యారు. ఈ కాలంలో - చారుమజుందార్ నాయకత్వంలోని అతివాద దుస్సాహసిక పంథాకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన విడుదలైన తర్వాత కామ్రేడ్ కానూసన్యాల్‌తో కలిసి ఓసిసిఆర్‌ను ఆ తర్వాత సిఓఐ(ఎమ్ఎల్)ను ఏర్పరిచారు. 2005లో సిపిఐ(ఎం-ఎల్) ఏర్పడినప్పుడు, కేంద్రకమిటి సభ్యులుగానున్న కామ్రేడ్ అసిత్‌సిన్హా కడదాకా ఆ బాధ్యతలలో కొనసాగారు.

కామ్రేడ్ అసిత్‌సిన్హా మంచి ఫుట్‌బాల్ ఆటగాడు. చిన్న-పెద్ద బేధభావం లేకుండా అందరితో కలగలిసిపోయే మనస్తత్వం ఆయనది. సిఓఐ(ఎమ్ఎల్)గానున్న కాలంలో ఆయన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కమిటీకి; పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని నదియా, మాల్దా జిల్లాలకు నాయకత్వ బాధ్యతవహించారు. సిపిఐ(ఎమ్-ఎల్) కేంద్ర కార్యనిర్వాహకవర్గ సభ్యునిగా, పార్టీ ఆంతరంగిక పత్రిక సంపాదకవర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు. పార్టీ జీవిత ప్రారంభంలో సంభవించిన ఒడిదుడుకుల కారణంగానే వైవాహిక జీవితాన్ని వద్దనుకోని, కడవరకు పార్టీకి అంకితమై, పార్టీయే కుటుంబంగా పరిగణించి అత్యంత నిబ్బరమైన, నిలకడైన, నిబద్ధమైన వ్యక్తిత్వంతో జీవించారు.

ఐదు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కామ్రేడ్ అసిత్‌సిన్హా మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనావిధానాన్నుండి బెసక్కుండా నిబద్ధతతో జీవించటమేగాక, ప్రజలను సంఘటితపర్చటానికీ, శ్రామికవర్గ ఐక్యపార్టీ నిర్మాణానికే తన శక్తి సామర్థ్యాలన్నింటినీ ధారపోశారు. 1996లో మొదటిసారి మెదడు పక్షవాతానికి గురైనప్పటికీ, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితివచ్చేదాకా ఆయన తన కార్యక్రమాలను కొనసాగించారు.

కా॥ అసిత్‌సిన్హాకు విప్లవజోహార్లు.

సిపిఐ(ఎం-ఎల్)
కేంద్రకమిటి

అంతర్జాతీయ శ్రామిక మహిళల దీక్షాదినం 'మార్చి 8' వర్ధిల్లాలి

కామ్రేడ్ గోవిందపన్సారేను ఘోరంగా హత్యచేయడాన్ని ఖండించండి

మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో గోవింద పన్సారేపై జరిగిన ఘోరమైన దాడిని 'జనశక్తి' తీవ్రంగా ఖండిస్తోంది. ఈ దాడి ఫలితంగా 16-2-15న ఆయన మరణించారు. కామ్రేడ్ పన్సారే మరియు ఆయన భార్య ఉదయపు నడక ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా దుండగులు వారిపై కాల్పులు జరిపి వారిని తీవ్రంగా గాయపరిచారు. తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ కా॥ గోవింద పన్సారే మరణించారు. మోడీ ప్రభుత్వ పాలనలో మహారాష్ట్రలో సామాజిక ఉద్యమకార్యకర్తలు, ప్రగతిశీలురైన వారిపై కొనసాగుతున్న హంతక దాడులలో ఇది మరో ఘటనగా వుంది.

కా॥ గోవింద పన్సారే సిపిఐ మరియు ఏఐటియుసి సీనియర్ నాయకులు. కొల్హాపూర్‌లో మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఆయన ముందు నిలిచారు. శివాజీకి మతరంగు పులమటాన్ని వెల్లడిచేస్తూ వాస్తవ చరిత్ర దృక్కోణం నుండి ఆయన ఓ పుస్తకాన్ని ప్రచురించారు. ఇటీవలే, కొల్హాపూర్‌లో టోల్‌టాక్స్ వసూళ్ళకు వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనల్లో ఆయన ముందువరుసలోనున్నారు. ఆయన సూత్రబద్ధ వైఖరులను మొదటి నుండీ ఇష్టపడని స్వార్ధపరశక్తులే ఈ దాడికి పాల్పడి వుంటారు.

కా॥ పన్సారేపై కాల్పులు సాగించిన హంతకులను వెంటనే అరెస్టుచేసి కేసు నమోదుచేయాలని; 'జనశక్తి' డిమాండ్ చేస్తోంది. ఈ తరహా ఫాశిస్టు దాడులకు వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా కదలాలని 'జనశక్తి' కోరుతోంది. ✡

పేదరికం, అసమానత్వం, అంతరాలే మూఢనమ్మకాల్ని పెంపొందించే కారణాలు

2014 నవంబర్ 25న, కర్నాటక రాష్ట్రం-మంగుళూరుకు దగ్గరలోని కుక్కే సుబ్రహ్మణ్య దేవాలయంలో 'మాదేస్నాన' అనే హిందూ సాంప్రదాయ తంతు సందర్భంగా అగ్రకుల ప్రజలు భోజనంచేసి వెళ్ళిన తర్వాత, ఆ ఎంగిలి ఆకులపై బలహీన వర్గాల ప్రజలు దొర్లుకుంటూ వెళ్ళారు. ఈ సాంప్రదాయానికి అక్కడ సామాజిక ఆమోదం వుంది.

2014 డిసెంబర్ మొదటివారంలో-రాజస్థాన్ రాష్ట్రం-భిల్వారా జిల్లాలోని చౌహానాన్ కమేరి గ్రామంలో 80 సం॥ల వయోవృద్ధురాలైన ఓ మహిళను ఖప్ పంచాయితీ ఆదేశంమేరకు, మంత్రగత్తెగా ముద్రవేసి నగ్నంగా ఓ గాడిదపై ఎక్కించి ఆమె ముఖంనిండా నల్లని రంగుపులిమి వీధులలో ఊరేగించారు. అంతేగాక ఖప్ పంచాయితీ ఆ గ్రామం నుండే ఆమెను వెలివేయాలని ఆదేశించింది.

2014 డిసెంబర్ రెండవ వారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - ప్రకాశం జిల్లా, మర్రిపూడి గ్రామస్థులు, ఓ శివాలయం దగ్గరలోని వేపచెట్టు నుండి పాలు కారటంచూపి, దానిని ఓ దేవుని లీలగా పరిగణించి దాన్ని కొలవటం ప్రారంభించారు.

పంజాబ్‌లోని జలంధర్‌లో వున్న దివ్యజ్యోతి జాగృతి సంస్థానంయొక్క ఓ శాఖ ప్రధాన కార్యాలయంలో, 'అశుతోష్ మహరాజ్' అనే దేవదూతగా భావించే ఆ ఆశ్రమ పెద్ద భౌతికకాయాన్ని 2014 జనవరి 29 నుండి 2014 డిసెంబర్ వరకు - అంటే 10 నెలలకు పైగా కాలంపాటు ఫ్రిజ్‌లో వుంచి ఆ ఆశ్రమ నిర్వాహకులు భద్రపరిచారు. మరణించిన ఆ దేవదూత తిరిగి లేస్తాడని వారు వేచి చూస్తున్నారు. పంజాబ్ హైకోర్టు జోక్యం చేసుకొని మృతశరీరానికి అంత్యక్రియలు జరపవలసిందిగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించింది.

2015 ఫిబ్రవరి 17 మహాశివరాత్రిని పురస్కరించుకొని విశాఖపట్నం జిల్లా-రావికం మండలం, కల్యాళపూర్ గ్రామంలో పెద్దింటమ్మ తల్లి దేవాలయంలో సంతానం లేని తల్లుల గర్భస్థానాలపై వాతలు వేయటమనే దురాచారం ఆ ప్రాంత ప్రజలందరి సమక్షంలో సాగించారు. ఇనుప త్రిశూలాన్ని నిప్పులలో కాల్చి సంతానం కోరుకునే మహిళల పొట్టలపై ముద్రవేస్తే, గర్భందాల్చి సంతానవతులవుతారని వారి నమ్మకం.

2015 ఫిబ్రవరి 18న కర్నాటక రాష్ట్రంలోని హోసళ్ళి అనే గ్రామంలో 5 సం॥ల గాయత్రి అనే పాపను అపహరించుకొని తీసుకెళ్ళి 'గుప్తనిధి'ని కనుగొనేందుకు ఆ పాపను బలిఇచ్చారు. కేరళకు చెందిన ఓ దొంగసాధువు సలహామేరకు బసవయ్యస్వామి అనే సాధువు అభ్యర్ధనతో ఈ ఘాతుక చర్యకు పాల్పడ్డారు.

ప్రస్తుత హైటెక్ యుగంగా చెప్పబడుతున్న మనదేశంలో లెక్కకు మించిన రూపాలలో మూఢాచారాలు, గుడ్డినమ్మకాల కారణంగా ప్రతిరోజూ జరుగుతున్న సంఘటనలలో పైన పేర్కొన్నవి కొన్ని ఘటనలు మాత్రమే.

దీనితోపాటుగా, లక్నోకు చెందిన జి బి పంత్ గ్రామీణాభివృద్ధి అధ్యయన సంస్థ సాగించిన ఓ అధ్యయనంలో భారతదేశంలోని అనేక ప్రాంతాలలో సాంప్రదాయ కొనసాగింపు పేరిట బాల్యవివాహాలు పెద్దఎత్తున సాగుతున్నాయని పేర్కొంది.

2015 జనవరిలో మాధ్యమాలలో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం - భారత దేశంలో అత్యంత ప్రగతిశీల రాష్ట్రాలలో ఒకటిగా పేర్కొనబడుతున్న మహారాష్ట్రలో గత సంవత్సరకాలంగా సగటున నెలకు కనీసం ఒక మనిషిని బలిస్తున్నారని పేర్కొంది. జబ్బులు తగ్గటానికో లేక గుప్తనిధుల పేరిటనో దొంగబాబాల సంప్రతింపులతో చిన్న పిల్లలను బలులివ్వటం అధికంగా సాగుతోంది.

ఈ మూఢాచారాలు, గుడ్డినమ్మకాలు, తాంత్రిక విద్యలన్నింటికీ ఒకరకపు మతపరమైన ఆమోదం, వాటిని ఆచరించేందుకు ప్రోత్సాహంతోపాటుగా సమాజంలో స్వార్ధపర శక్తులు తమ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకూడా వీటిని పెంచిపోషిస్తున్నారు. ఈ గుడ్డి విశ్వాసాలననుసరించటం నానాటికీ పెరిగిపోవటం వెనుక-భారతదేశంలో నెలకొన్న అర్ధ-ఫ్యూడల్ వ్యవస్థ పునాదిగా సాగుతోన్న నయాఉదారవాద ఆర్ధిక విధానాల కారణంగా తీవ్రమౌతోన్న దుర్భర దారిద్ర్యం, అంతరాలు, అసమానతలు, తీవ్ర అనారోగ్యాలే-ఈ మూఢాచారాలను, గుడ్డి నమ్మకాలను అనుసరించేందుకు అనుకూలమైన ఓ భూమికను తయారుచేస్తోందనే నిర్ధారణకు మనం రావలసి వుంటుంది.

అయితే, ఈ మూఢాచారాలు, గుడ్డి నమ్మకాలు, క్షుద్రపూజలు వంటి సామాజిక దురాచారాలను నిర్మూలించకుంటే, మనదేశం, సమాజం నిజమైన అర్థంలో ముందడుగువేసి ఆధునికంగా రూపొందలేదు.

శాస్త్రీయ వివేచనను, స్ఫూర్తిని ప్రజలలోనూ ప్రత్యేకించి యువకులు, చదువుకున్న వారిలోనూ పెంపొందించవలసి వుంది. శాస్త్రీయ వివేచనను, ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించి తీరాలి.

స్వార్థప్రయోజనాలతో నున్న పాలకులు మరియు పాలకవర్గాలు వారి వర్గప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించవు గనుక ఈ దిశగా ఏవిధమైన నిర్దిష్ట చర్యలనూ తీసుకోవు.

కనుక, ప్రజల మనసులనుండి, ఆలోచనలనుండి ఈ దురాచారాలను, మూఢనమ్మకాలను తొలగించటానికి చైతన్యవంతంచేసే ప్రచారాన్ని నిర్వహించాల్సిన కర్తవ్యం మనదేశంలోని ప్రగతిశీలశక్తులందరిపై వుంది. ✡

సోవియట్ యూనియన్‌లో స్త్రీల పరిస్థితి



రచన : **జి.యన్. సెరిబ్రెన్నికోవ్** అనువాదం : **తోలేటి జగన్మోహనరావు**

ప్రచురణ : **తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్** వెల : **రూ.120/-**

ప్రతులకు : **మైత్రీబుక్‌హౌస్**

28-9-1, జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 2

ప్రదర్శనాత్మక చర్యలతో 'మహిళాశక్తి' పేరిట వంచన

దేశ రాజధాని నగరంలో ఈ సంవత్సరపు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన కవాతులో, అమెరికా అధ్యక్షుడు త్రివిధ బలగాలను పరిశీలించి, గౌరవవందనం స్వీకరించే కార్యక్రమానికి ఓ మహిళా సైనికాధికారిణి నేతృత్వం వహించింది. భారత రాష్ట్రపతి జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న సమయంలో మరో మహిళా సైనికాధికారిణి ఆయన ప్రక్కనే వుండి సహకరించింది. అలాగే మొదటిసారి త్రివిధ బలగాలకు చెందిన మహిళా సైనిక బృందాలు రాజ్‌పథ్ వరకు కవాతు నిర్వహించాయి. ఈవిధంగా యావత్ ప్రపంచం ఎదుట మోడీ ప్రభుత్వం 'మహిళాశక్తి' పేరిట ప్రదర్శనాత్మక చర్యలు చేపట్టింది.

ఈ ప్రదర్శనాత్మక చర్యలనే 'మహిళాశక్తి'గా చూపించటమనేది - ఈ దేశంలో పురుషులకంటే మహిళలను తక్కువ చేసిన పరిస్థితులనేమీ మార్చబోదు; లేదా, భారత సైనిక బలగాలలో నిజానికి దిగజారిన మహిళల స్థితిగతులనూ దాచిపెట్టబోదు.

మహిళా సైనికాధికారిణులకు పురుషులతో సమానంగా స్థిరమైన కమీషన్ హోదా సైన్యంలో ఇప్పటికీ నిరాకరింపబడుతుండటం రహస్యమేమీ కాదు. మహిళా సైనికాధికారిణుల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాచే వివక్షాపూరిత విధానాలను కొనసాగనివ్వ రాదని, అర్హులైన వారికి స్థిరమైన కమిషన్ హోదాను కల్పించాలనీ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రక్కన బెడుతున్నారు. "సైన్యంలో చేర్చుకోబడిన అత్యధిక జూనియర్ కమిషన్ అధికారులు, ఇతర శ్రేణుల అధికారులంతా దేశంలోని గ్రామీణ ప్రాంత నేపథ్యం నుండి వచ్చిన వారు కనుక, యుద్ధ పరిస్థితుల్లో వారు తమకు నాయకునిగా ఓ మహిళా అధికారిని అంగీకరించటానికి ఇప్పటికీ సిద్ధంగాలేర"ని సైన్యాధికారులు వాదన చేస్తున్నారు. పైగా దేశంలోని ఉన్నత న్యాయస్థానానికి దీనిపై వివరించే సందర్భంలో కూడా "సిద్ధాంత ప్రకారం సైన్యంలో మహిళలు గొప్పగానే వున్నప్పటికీ, ఆచరణలో భారత సైన్యంలో అది సత్ఫలితాలనేమీ ఇవ్వలేదని; అలాగే, ఒక దృక్పథం గానే, యుద్ధపాత్రలో మహిళలను అంగీకరించేందుకు మనసమాజం సిద్ధంగా లేదు" అనీ ఎంతో నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. కనుక, మహిళల శక్తిసామర్థ్యాలను గుర్తించేందుకు, సైనిక బలగాలలో పురుషులతో సమానంగా వారికి హోదాలిచ్చేందుకు సమాజపు ఆమోదం లేదనే పేరిట సైన్యం అందుకు నిరాకరిస్తోంది. సైనిక బలగాలలో నిజానికి మహిళాశక్తి పరిస్థితి పితృస్వామ్య ఆలోచనలతోనున్న మగవారి ఆమోదంపై ఆధారపడి ఇంతటి హాస్యాస్పదంగా వుంది.

విమానయానరంగంలో కూడా మహిళల పరిస్థితి ఏ రకంగానూ మెరుగైనవిధంగా లేదు. పౌరసమాజం లోనూ మహిళల అసమానత్వ పరిస్థితి నిరాటంకంగా కొనసాగుతూ వస్తోంది.

గ్లోబలీకరణ యుగంలో మనసమాజం ఆధునికత్వం, అత్యాధునికత్వాన్ని సంతరించుకుందునే ప్రకటనలకు భిన్నంగా ఈనాటికీ భారత దేశపు సగటు మహిళ హీనంగా పరిగణించబడుతోంది.

ఆడబిడ్డల భ్రూణహత్యలు అనునిత్యం సాగుతున్నాయి. వరకట్న హత్యలు నిరోధించబడలేదు. విద్యా, ఉపాధి రంగాలలో మహిళలపట్ల వివక్షత ఈనాటికీ కొనసాగుతోంది. మహిళలతో చిత్తమొచ్చిన రీతిలో వ్యవహరించటమనేది, చట్టభీతి లేకుండా సాగుతూనేవుంది. నానాటికీ మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయి.

భారతదేశపు కార్మికులలో మహిళలు ఒక చిన్న భాగంగా వున్నారు. శ్రామిక మహిళలలో అత్యధికులు (69శాతం) వ్యవసాయరంగంలో వ్యవసాయకూలీలుగా పనిచేస్తున్నారు. కార్మికులుగా వున్న మహిళలలోనూ అత్యధికులు అసంఘటిత విభాగంలో ఏరకపు భద్రత, సంక్షేమ సదుపాయాలూ లేకుండా వున్నారు.

మహిళా కార్మికులు, పురుషులతో సమానంగా పనిచేసినప్పటికీ వారితో సమానంగా వేతనం చెల్లించ బడటంలేదు. శ్రామిక మహిళలుగా వున్న వారు వారితోపాటు పనిచేస్తున్న పురుష కార్మికులకంటే 29 శాతం తక్కువ వేతనాన్ని పొందుతున్నారు. పురుషుల కంటే చాలా తరచుగా, చాలా త్వరగా పనుల నుండి తొలగింపబడుతున్నారు.

వివిధ మహిళా సంక్షేమ పథకాల కోసం సాంవత్సరిక బడ్జెట్‌లలో కేటాయించబడే మొత్తాలు ఎంత చిన్నపాటివైనప్పటికీ, అవి కూడా నిర్దేశిత పథకాలకు పూర్తిగా ఖర్చుపెట్టటం లేదని 'కాగ్' నివేదిక పేర్కొంది.

పంచాయితీలలో మహిళల ప్రాతినిధ్యాన్ని, ప్రత్యేకించి దళిత మహిళల స్థితిని హాస్యాస్పదంగా మార్చివేశారు. పంచాయితీలలోగానీ, లేదా శాసనసభలు, పార్లమెంటులలోగానీ పురుషాధిపత్య ఆంక్షలు లేకుండా మహిళా ప్రతినిధులు స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశంలేదు.

కనుక; గత 67 సంవత్సరాల 'స్వతంత్ర' పాలనలో రాజ్యం ఎదుట అందరూ సమానులేనని, వివక్ష కూడదని, సమాన అవకాశాలు, సమాన పనికి సమాన వేతనమనే భారత రాజ్యాంగం ప్రసాదించిన గ్యారంటీలుగా చెప్పబడేవి వున్నప్పటికీకూడా, ఆచరణలో మహిళలకు అవి ఎన్నటికీ వాస్తవిక రూపం దాల్చని ఓ ఎండమావిలా మిగిలివున్నాయి.

భారతదేశంలో మహిళల హీనమైన పరిస్థితులకు, అసమానత్వానికి కారణం ఈ సమాజ పునాది అయిన పితృస్వామ్య అర్ధఫ్యూడల్ వ్యవస్థలోనే వుంది.

కనుక, మన వ్యవస్థ యొక్క ఈ అర్ధఫ్యూడల్ పునాది యధాతథంగా కొనసాగినంతకాలం మహిళల అసమానత్వ పరిస్థితుల్లో ఎలాంటి మార్పూ వుండదు; అలాగే సైన్యంలో, ఇతర రంగాలలోనూ మహిళా అధికారిణుల అంశంలో వ్యక్తమైనవిధంగా పురుషులతో సరిసమానమైన స్థానాలను మహిళలు చేరుకోలేరు.

అయితే, మహిళలను శాశ్వతంగా వివక్షకు గురి చేస్తున్న ఈ వ్యవస్థను కూలదోసేందుకు నిజాయితీతో కూడిన ఏలాంటి ప్రయత్నాలు చేయకపోగా, ఈ అభివృద్ధి నిరోధక పితృస్వామ్య, అర్ధఫ్యూడల్ వ్యవస్థను అన్ని విధాలుగా పరిరక్షించటానికి మన పాలకులు, పాలకవర్గాలు కృషి చేస్తున్నారు. మరోవైపున కపట నినాదాలు, శుష్కరాజకీయ వాగ్దానాలతో మహిళలకు సమానత్వాన్ని, సాధికారతను సాధిస్తామని చెప్తూ ప్రజలను మోసం చేస్తున్నారు.

సైనిక బలగాల గౌరవ వందనం స్వీకరించే సమయంలో 'మహిళాశక్తి'ని ప్రదర్శించటమనేది - ప్రజలను, ప్రత్యేకించి అశేష మహిళలను మోసగించే చర్య మినహా వేరుకాదు.

'హిందూ' మహిళలు నలుగురికి మించి పిల్లల్ని కనాలంటూ ఆదేశాలిస్తున్న, వివిధ రూపాల్లో హిందూ మతతత్వాన్ని ప్రజలపై రుద్దజూస్తున్న బిజెపి ప్రభుత్వం మహిళలపట్ల వివక్షను అంతమొందించి మహిళా సాధికారితను సాధించేవైపుగా అన్నిరంగాలలో సమానత్వాన్ని సాధించే నిజాయితీతో కూడిన ప్రయత్నాలను చేయబోదని స్పష్టమౌతోంది. 'మహిళా శక్తి' పేరిట ప్రదర్శనాత్మక చర్యలను గమనించినపుడు వారి అవివేకం వెల్లడవుతోంది.

కనుక, భారతదేశంలో అర్ధఫ్యూడల్ వ్యవస్థను కూలద్రోయటం ద్వారా మాత్రమే పితృస్వామ్య కాడి క్రింద నుండి మహిళలు వాస్తవికంగా విముక్తం కాగలుగుతారు.

మనదేశంలో, సమానత్వ లక్ష్యసాధన కోసం నిజాయితీగా కృషిసాగిస్తున్న ప్రగతిశీల శక్తుల ముందున్న అసలైన, జరూరు కర్తవ్యమిదే. ✡

జనశక్తి సంచికను ఆన్‌లైన్ ద్వారా చదువుకొనుటకు

జనశక్తి — విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

వెబ్‌లింక్‌ను సందర్శించండి

జనశక్తిలో ప్రచురించుటకు రాసిన వ్యాసాలు, రిపోర్టులను

janasakthi1963@gmail.com

అనే ఈ-మెయిల్‌కు పంపగలరు

క్యూబా

సంబంధాల సాధారణీకరణకు జాతీయ స్వాతంత్ర్యాన్ని గౌరవించాలి

2014 డిసెంబరు 17న అమెరికా అధ్యక్షుడు ఒబామా క్యూబాతో సాధారణ సంబంధాల ఏర్పాటుకు తన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రకటించాడు. క్యూబాను ఏకాకినిచేసేందుకు అమెరికా అనుసరించిన విధానానికి "కాలం చెల్లిపోయింద"నీ, "విఫలమైంద"నీ, "మరే ఇతర దేశమూ దీనిని సమర్ధించలేద"నీ కూడా ఆ ప్రకటనలో ఒబామా అంగీకరించాడు. "దశాబ్దాల క్రితం విధించిన ఆంక్షలు చట్టంలో భాగమయ్యాయి. ఆంక్షలు అమెరికాకు ఉపయోగపడలేదు. క్యూబాను దెబ్బతీయలేకపోయాయి. ఆంక్షలను ఎత్తివేసేందుకు సెనెట్ చర్చ కోసం వేచి చూస్తున్నాను" అని ఒబామా ప్రకటించాడు.

క్యూబా అధ్యక్షుడు రవుల్ కాస్ట్రో, ప్రతి స్పందనగా అదే రోజున హవానా నుండి చేసిన ప్రకటనలో "మా ప్రజల జాతీయ స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాధికారాలకు భంగం కలుగని రీతిలో సమాన స్థాయిలో అమెరికాతో సంభాషణలకు మా సంసిద్ధతను అనేకసార్లు నేను వ్యక్తం చేశాను" అని పేర్కొన్నాడు. "ఆంక్షలు అమెరికా చట్టంలో భాగంగా వున్నప్పటికీ, వాటి అమలును ఆపే అధికారం అధ్యక్షుడికి వుంది" అని కూడా నిర్దిష్ట ప్రతిపాదన చేశాడు.

అమెరికా తన విధానాన్ని మార్చుకున్నానని ప్రకటించటం సామ్రాజ్యవాద జోక్యం, బెదిరింపులకు వ్యతిరేకంగా క్యూబా ప్రజలు సాగించిన సూత్రబద్ధ పోరాటం సాధించిన విజయం. సాధారణ సంబంధాల ఏర్పాటులో భాగంగా 10 ఏళ్లుగా అక్రమ జైలు నిర్బంధంలో వుంచిన ఐదుగురు క్యూబా పౌరులను అమెరికా విడుదల చేయాల్సి వచ్చింది. వారు తిరిగి క్యూబాకు రావటాన్ని క్యూబా ప్రజలు ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు.

అయినా ఆంక్షలను ఎత్తివేయాల్సిన సమస్య ఇంకా మిగిలే వుంది. ఫెడల్ కాస్ట్రో నాయకత్వంలో విప్లవకారుల 1959లో క్యూబాలో విప్లవాన్ని తీసుకొచ్చారు. విప్లవప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద ఆస్తులను జాతీయం చేసింది. ఆనాటి నుండీ కోటి పది లక్షల క్యూబా దేశీయులను లొంగదీసుకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదం అనేక విధాలుగా ప్రయత్నాలు చేసింది. కాస్ట్రో, ఇతర క్యూబా నాయకుల పై హత్యా ప్రయత్నాలు, టెర్రరిస్టుదాడులు, రాజకీయ కుట్రలు, రెచ్చగొట్టే చర్యలూ, దాడులు సాగించింది. క్యూబా పై దిగ్బంధన ఆంక్షలు విధించింది. ఇవేవి అది కోరుకున్న ఫలితాన్నివ్వలేదు.

దశాబ్దాల పాటు అమలు చేసిన ఈ విధానానికి క్యూబా ప్రజలతో పాటుగా ఇతర దేశాల ప్రజలు కూడా గురయ్యారు. లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదుల విధానాన్ని నిర్దేశించిన అంశాలలో పెరుగుతున్న క్యూబా ప్రభావం కూడా ఒకటి. నికరాగువాలో అడవులు, పంటలను తగులబెట్టిందీ, పాఠశాలలూ, ఆస్పత్రులను కూల్చివేసింది ఇందుకోసమే. అమెరికా గూఢచారి సంస్థ పంపిన హంతకదళాలు ఎల్ సాల్వడార్ ప్రజలను రక్తంలో ముంచాయి. గ్రెనెడాపై దురాక్రమణ, పనామా, హైతీ, పెరు, హండురాస్, గ్యాటిమాలలో రాజకీయ సైనిక జోక్యాలు ఇందుకోసమే సాగాయి.

ఇప్పుడు అమెరికా సామ్రాజ్యవాదం ఈవిధానాన్ని మార్చుకున్నాననంటున్నది. క్యూబాను టెర్రరిజాన్ని ప్రోత్సహించే రాజ్యంగా ప్రకటించటాన్ని సమీక్షించమని ఒబామా తన విదేశాంగ శాఖను ఆదేశించింది. "గత కొన్ని దశాబ్దాలలో టెర్రరిజం మారిపోయింది" అని ఒబామాఅన్నాడు. అవును మారిపోయింది. ఆగ్రహంలో కొందరు యువకులు టెర్రరిస్టు పద్ధతిని చేపట్టేవారు. ఇప్పుడు అమెరికా, ఇతర సామ్రాజ్యవాదుల నిధులు, ఆయుధాలు, శిక్షణలతో పాటు రాజకీయ, దౌత్య మద్దతుతో టెర్రరిస్టు చర్యలు సాగుతున్నాయి. 1976లో క్యూబా విమానం ఫ్లైట్ 435ను సముద్రంలో కూల్చి వేశారు. 73 మంది హతులయ్యారు. ఈ టెర్రరిస్టు చర్యకు అమెరికా సహాయం వుంది. ఈ టెర్రరిస్టు చర్యలను ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా, ఉత్తర ఆఫ్రికాలకు విస్తరింపచేసింది.

క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ విడుదల చేసిన ప్రకటనలో అమెరికా ఇంతవరకూ అనుసరించిన విధానం "క్యూబాను ఏకాకిని చేసే బదులుగా ఆ దేశాన్నే అంతర్జాతీయంగా ఒంటరిని చేసింద"ని పేర్కొంది. అనుకున్న లక్ష్యాన్ని సాధించనందున అమెరికా విధానాన్ని మార్చుకుంటున్నది. పద్ధతులను మార్చుకుంటున్నది; లక్ష్యాన్ని కాదు.

కాలం చెల్లిన విధానం అమెరికా ప్రయోజనాలను నెరవేర్చలేదని ఒబామా అనటంలో అమెరికా సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడి ప్రయోజనాలే అతని దృష్టిలో వున్నాయి. దిగ్బంధనాన్ని తొలగించి ఇతర పద్ధతుల ద్వారా క్యూబాతో వ్యవహరించాలని గుత్త పెట్టుబడి సిద్ధపడింది. కరిబియన్ సముద్రంలో చమురు అన్వేషణకు ఇతరులు రాకుండా చూడటం ఆర్థిక అంశంకాగా, లాటిన్ అమెరికా దేశాలూ, ప్రజల నుండి ఏకాకి కావటాన్ని తొలగించేందుకు క్యూబా పట్ల విధాన మార్పునే రాజకీయంగా ముందుకు తెస్తున్నారు.

డిసెంబరు 17 ప్రకటనలో క్యూబా ఆర్థిక రాజకీయ వ్యవస్థ పట్ల అమెరికా వ్యతిరేకతను దాచుకునేందుకు ప్రయత్నించలేదు. క్యూబా సామాజిక వ్యవస్థలో మార్పులుతెచ్చేందుకు ఇతర మార్గాలున్నాయని అది పేర్కొంది. మెక్సికన్ అఖాతంలో క్యూబాకు ఇతర దేశాలతో ప్రధానంగా మెక్సికోతో సముద్ర సరిహద్దుల నిర్ధారణపై చర్చల అవసరముందని అది పేర్కొంది. క్యూబా ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేసుకునే అమెరికా విధానంలో ఎలాంటి మార్పు ఉండబోదన్నది స్పష్టమే.

తాము కోరుకున్న విధంగా జీవించేహక్కు క్యూబా ప్రజలకున్నదని "జనశక్తి" ప్రకటిస్తున్నది. అమెరికాతో సహా ఇతర దేశాలతో సాధారణ సంబంధాలు నెలకొల్పుకుంటూ, తమ జాతీయ స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాధికారాన్ని కలిగి వుండే క్యూబా ప్రజల, ప్రభుత్వ విధానానికి "జనశక్తి" మద్దతు తెలుపుతున్నది. క్యూబా ప్రజలపై అమెరికా సామ్రాజ్యవాదం రుద్దిన ఆర్థిక దిగ్బంధనాన్ని తక్షణమే సంపూర్ణంగా ఎత్తివేయాలని డిమాండు చేస్తున్నది. ✡

అమెరికా పాలకుల క్రూరమైన నేరచరిత్ర

అమెరికా పాలకులు, పాలకవర్గాలు–తమదేశం అత్యున్నత వ్యక్తిగత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పౌరులకు ప్రసాదించిన దేశంగా; అంతేగాక వాస్తవ, సంపూర్ణ ప్రజాస్వామికదేశంగా ఎల్లప్పుడూ తమను తాము కీర్తించుకుంటూ వుంటారు. వారెల్లప్పుడూ మానవ హక్కుల, ప్రజాస్వామ్యహక్కుల పవిత్రతగురించి పెద్ద గొంతుతో మాట్లాడుతూ ప్రపంచవ్యాపితంగా ఈ హక్కులకు తామే ఛాంపియన్లుగా పోజుపెడుతూ వుంటారు. వారు ప్రపంచంలో తమని తాము స్వీయ నియమిత 'హక్కుల పరిరక్షకులు'గా భావిస్తూ యావత్ ప్రపంచంలో ప్రజాస్వామ్య, ప్రజాస్వామ్య హక్కుల ఉద్ధారకులుగా వ్యవహరిస్తూ వుంటారు.

అయితే దీనికి పూర్తిభిన్నంగా తన 'శత్రు' దేశాలపై నిందార్హమైన తమ రక్షణ విధానాలను ప్రయోగించ కుండా; అమాయక పౌరులను క్రూరమైన చిత్ర హింసలకు గురిచేయకుండా – అమెరికా ప్రభుత్వానికి ఒక్కగానొక్కరోజుకూడా గడవదనేది వాస్తవం. అమెరికా తనను తాను ప్రపంచ న్యాయనిర్ణేతగా భావించు కుంటూ, ఇతర దేశాల మానవహక్కుల పరిస్థితులపై లెక్కలేనితనంతో మాట్లాడుతూ వస్తోంది.

కాగా, అమెరికా సెనేట్‌కు చెందిన 'ఇంటలిజెన్స్ కమిటీ' 2001–06 సం॥ల మధ్యకాలంలో ఆల్–ఖైదా అనుమానితులపై సిఐఏ చేపట్టిన విచారణ గురించి విడుదల చేసిన తాజా నివేదిక అమెరికా పాలకుల క్రూరమైన వాస్తవ ముఖాన్ని మరియు వారి వంచనను వెల్లడిచేస్తోంది. 119 మంది వ్యక్తులను చిత్రహింసలను పోలిన తీవ్రమైన విచారణ పద్ధతులకు సిఐఏ గురిచేసిందని ఈ నివేదిక వెల్లడి చేసింది. బహిరంగంగానూ, బెదిరింపులకు గురిచేయనివిధంగా ప్రశ్నించటంగాకుండా మొదటి నుండి సిఐఏ అత్యంత మొరటు పద్ధతులను వుపయోగిస్తూ వస్తోందని ఈ నివేదిక పేర్కొంది. దాదాపుగా నీటిలో ముంచివేసే క్రూరపద్ధతులను గురించి నివేదిక పేర్కొంది. 2002 సెప్టెంబరులో క్రూరమైన చిత్రహింసల స్థావరమైన 'బ్లాక్‌సైట్'గా పేర్కొనబడే చీకటి జైలును ఆఫ్ఘనిస్తాన్‌లో (దీనిని 'ఉప్పు ఊబి' అని అంటారు) సిఐఏ నెలకొల్పింది. ఈ జైలుగురించి లాంఛనప్రాయమైన రికార్డులను వేటినీ సిఐఏ కలిగిలేదు. శిక్షణపొందని సిఐఏ అధికారులు ఇక్కడ క్రూరమైన పద్ధతుల్లో విచారణలు నిర్వహించేవారని నివేదిక పేర్కొంది. సిఐఏకుచెందిన అనేకమంది ఉద్యోగులు ఈ స్థావరంలో హింసాత్మక చర్యలకు పాల్పడిన చరిత్రవుంది. ఇక్కడ నిర్బంధితులను బలవంతంగా నగ్నంగా చుట్టూతిప్పి నడిపించేవారు. అనేకమంది ఖైదీలను బంధించి, క్రిందకు ఈడ్చుకుంటూ తెచ్చి అనేక దూషణలకు గురిచేసేవారు. ఖైదీల పిల్లలకు హానితలపెడతామనే బెదిరింపులతోపాటు వారి భార్యలను, తల్లులను, కూతుళ్ళను లైంగికంగా దూషణలకు గురిచేసేవారు. అనేకమంది ఖైదీలు లైంగికంగా దాడులకుగురయ్యారు. బయటకు వెళ్ళి వెలుతురును చూసే అవకాశంలేదని, ఒకేసారి శవపేటికలో మాత్రమే బయటకు పంపబడతారని అనేకమంది ఖైదీలను మానసిక చిత్రహింసలకు గురిచేసేవారు. అమెరికా మిత్రకూటమి దేశాలలో సిఐఏ ఆధ్వర్యంలోని రహస్య కారాగారాల్లో లేదా గ్వాటిమాలోలోని అమెరికా నిర్బంధ కేంద్రాలలో అనేకమంది నిర్బంధింపబడ్డారు. 5గురు ఖైదీలకు బలవంతంగా పురీషనాళంద్వారా ఆహారాన్ని, నీరును అందించటం జరిగింది. అనేకమంది బంధితులు ఏకధాటిగా 180 గంటలపాటు–కొన్ని సందర్భాలలో నిలబడి, బేడీలు వేసిన చేతులను తలపై వుంచుకొని రెప్పవాల్చకుండా మేల్కొనివుండే హింసలకు గురిచేయ బడ్డారు. పాక్షిక నగ్నంగా మరో ఖైదీ అరదండాలతో నేలపై బంధించబడివుంచారు. ఆ తర్వాత అతను 'హైపోనేసోనియా' జబ్బుతో మరణించాడు. మరో బంధితుడు ఇదే కారణంతో 2002 నవంబర్‌లో మరణించాడు. విరిగిన పాదాలతో, విరిగిన కాళ్ళతో వున్న ఖైదీలను బలవంతంగా నిలబెట్టివుంచేవారు. ఈ విధంగా సిఐఏ ఆధ్వర్యంలో టెర్రరిస్టులుగా అనుమానించిన వారిని అమానవీయ, క్రూరమైన చిత్రహింసలకు గురిచేసిన అత్యంత భయంకరమైన చర్యలు కొనసాగాయి.

అమెరికా ప్రభుత్వం ఈవిధంగా అనేక ఘోరమైన నేరాలకు పాల్పడింది. 2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని జంటభవనాలపై ఆల్–ఖైదా దాడుల తదనంతరం ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జిడబ్ల్యు బుష్ పరిపాలనా చర్యలలో భాగంగా చేపట్టిన 'ఉగ్రవాదంపైయుద్ధం'లో భాగంగా ఆయన ఆమోదం తోనే ఈ నేరాలు జరిగాయి. జి.డబ్ల్యు.బుష్ పాలనలో అమెరికా ప్రభుత్వం ఆమోదించిన 12 రకాల క్రూరమైన చిత్రహింసల పద్ధతులను గురించి ఈ నివేదిక వెల్లడి చేసింది. ఏమైనప్పటికీ ఈ నివేదిక ఒక 'రాజకీయ పత్రంగా' కన్పడుతోంది. అమెరికా సెనెటర్ ఫైన్‌స్టూన్ అధ్యక్షతన ఈ సెనేట్ కమిటి రిపబ్లికన్ పార్టీకి చెందిన బుష్ పరిపాలనా కాలంలోని తప్పిదాలను వెల్లడి చేయటానికి మాత్రమే పరిమితమైంది. రిపబ్లికన్ పార్టీని ఇబ్బందికర పరిస్థితుల్లో వుంచి తద్వారా రిపబ్లికన్ పార్టీపై డెమోక్రటిక్ పార్టీ రాజకీయ ఆధిపత్యంపొందేందుకు తప్పితే, నిజాయితీగా, చిత్తశుద్ధితో మానవహక్కులను, మానవహక్కులపై అంతర్జాతీయ సాంప్రదాయాలను, అంతర్జాతీయ మానవీయ చట్టాలను మరియు అంతర్జాతీయ నేర చట్టాలను ధిక్కరించి సాగించిన ఈ క్రూరమైన నేరాలను వ్యతిరేకించే ఉద్దేశ్యంతో ఈ నివేదికను వెల్లడి చేయ లేదనేది స్పష్టం.

క్రూరమైన చిత్రహింసల పద్ధతుల తీవ్రత గురించి సెనేట్‌కమిటి నివేదిక ఎక్కువ వక్కాణింపు నిచ్చిందికానీ, దీనిలో నిబిడీకృతమైవున్న నైతిక అంశాల గురించి పట్టించుకోలేదు. అదేవిధంగా రహస్య సమాచారాన్ని రాబట్టే పద్ధతులలో చిత్రహింసల విధానాల 'ప్రయోజనం అంతగా వుండద'ని ఈ నివేదిక నొక్కి చెప్పింది.

కనుక, రిపబ్లికన్ పార్టీ, డెమోక్రటిక్‌పార్టీ–రెండు పార్టీల సెనేటర్లు – మానవహక్కులను, ప్రజాస్వామ్య హక్కులను మరియు అంతర్జాతీయ నేర చట్టాలను ఉల్లంఘించి అమెరికా జరిపిన క్రూరమైన, ఘోరమైన నేరాల గురించి సిగ్గుపడటంలేదు; కానీ, ఉగ్రవాద 'అనుమానితుల' నుండి రహస్య సమాచారాన్ని రాబట్టు కోవటంలో క్రూరపద్ధతుల ఉపయోగాన్ని గురించి వారిలో వారు పోటీపడుతున్నారు.

సిఐఏ నిర్వహించిన ఓ రహస్య అంతర్గత సమీక్షలో నివేదికలో పేర్కొన్న విధంగానే ఖైదీలపై క్రూరమైన హింసాయుత పద్ధతులు ప్రయోగించ బడ్డాయని అంగీకరించింది. కానీ, బహిరంగంగా ఖైదీలపై క్రూరమైన హింసాయుత పద్ధతులను అనుసరించడాన్ని సిఐఏ నిస్సిగ్గుగా సమర్ధించుకుంది. ఒసామాబిన్ లాడెన్ వంటి వారిని పట్టి బంధించేందుకు ఈ పద్ధతులు తమకు తోడ్పడ్డాయని పేర్కొంది.

మరీ ముఖ్యంగా, అమెరికా సెనేట్ విడుదల చేయనున్న నివేదికలో 9/11 ఘటనల తదనంతర విచారణా కార్యక్రమాల్లో యు.కె. హస్తాన్ని కప్పిపుచ్చేందుకు, దానిని తొలగించేందుకు ఇంగ్లాండ్ ప్రభుత్వం చేసిన అభ్యర్ధనను అమెరికా ప్రభుత్వం ఆమోదించి, తదనుగుణంగానే నివేదికను విడుదల చేసిన అంశం వెలుగులోకి వచ్చింది.

ఏమైనప్పటికీ, ప్రభుత్వ ఆమోదంతో సిఐఏ చేపట్టిన ఈ క్రూరమైన హింసాయుత పద్ధతులు – అమెరికా మానవ హక్కులను ఉల్లంఘించినదనేకాక, జాతి వివక్షావిధానాలను అనుసరించిన దోషిగా కూడా నిలబెడుతున్నాయి.

సిఐఏ అనుసరించిన విచారణాపద్ధతులు, జర్మనీ నాజీ పాలకుల నేరాలతో కూడా పోల్చలేనివి; ఎందుకంటే ఇవి నాజీ జర్మనీకంటే మరింత క్రూరంగా అమానవీయంగా వున్నాయి.

అయితే, జర్మన్లు తమ నేరాన్ని పదే, పదే అంగీకరించారు; అనంతంగా దానిని గురించి చర్చ చేశారు; తమ తప్పిదాన్ని ఆమోదించారు. అయితే అమెరికా ప్రభుత్వం, అమెరికా పాలకులు తమ తప్పిదాన్ని ఆమోదించకుండా పొగరుగా నిరాకరిస్తున్నారు. అధ్యక్షుడు ఒబామా దీనిపై చాలా మామూలుగా మాట్లాడుతూ, 'మొరటు పద్ధతుల ప్రయోగం మా దేశపు మా విలువలతో పొసగనిదేగాక, అవి మా విశాల ఉగ్రవాద వ్యతిరేక ప్రయత్నాలకు లేక మా జాతీయ భద్రతా ప్రయోజనాలకు తోడ్పడవనే నా దృక్పథాన్ని ఈ నివేదిక మరింత బలపరుస్తోంది' అన్నాడు. ఈవిధంగా నివేదికలో పేర్కొన్న క్రూర హింసాయుత పద్ధతుల ప్రభావం గురించి మాత్రమే పేర్కొన్నాడు. అంతేగాక, 'ఏ దేశమూ పరిపూర్ణమైనది' కాదంటూ పరోక్షంగా క్రూరత్వానికి సమర్ధనలిచ్చాడు. "అమెరికా నైతిక ఆధిపత్యం ప్రధానంగా క్షీణించి పోయినట్లయితే, ఐఎస్ఐఎస్‌కు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో మధ్యప్రాచ్యంలోని అనేక దేశాలతోసహా అరవైకి పైగా దేశాలు మాతో చేరి ఓ కూటమిగా ఏర్పడటంలో మేము అంతగా సఫలమైవుండేవారిమి కాదు" అని మరోవైపు శ్వేతసౌధవర్గాలు వాదన చేశాయి. ఐఎస్ఐఎస్‌కు వ్యతిరేకంగా కూటమిగా ఏర్పడటాన్నే రుజువుగా చెబుతూ, అదే అమెరికా యొక్క మానవహక్కుల క్రూరమైన ఉల్లంఘనల ఘోరమైన నేరచరిత్రనంతటినీ విముక్తి చేస్తుందన్నట్లుగా పేర్కొంటున్నారు. పైపెచ్చు శ్వేతసౌధపు ప్రచార శాఖా మంత్రి మాట్లాడుతూ 'చక్కగా స్థిరపడిన ప్రజాస్వామ్య పద్ధతులనుండి ప్రక్కదోవపట్టించే, మానవహక్కులను, ప్రధాన స్వేచ్ఛలను ఉల్లంఘించే వెనిజులా ప్రభుత్వం యొక్క చర్యలను చూస్తూ మేము మౌనంగా వుండజాలమ'ని అత్యంత నిర్లక్ష్యంగా ప్రకటించాడు. తన ప్రకటనలలో ఆయన, అంతర్జాతీయ న్యాయాని కనుగుణంగా తమ ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిరాకరిస్తూ యావత్తు ప్రపంచాన్ని మోసగించటానికి గొప్పప్రయత్నం చేశాడు.

నేరపూరిత కుట్రలు, క్రూరమైన అత్యాచారాలు, ఉల్లంఘనలను వెల్లడించేందుకు నమోదు చేయబడి లభ్యమయ్యే సాక్ష్యాధారాలను ఒక పద్ధతి ప్రకారం నాశనం చేసేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని నివేదికల ఆధారంగా స్పష్టమౌతోంది.

హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం – జార్జి డబ్ల్యుబుష్‌తో సహా నేరచరితులైన అమెరికా ప్రభుత్వాధి నేతలను విచారించి, శిక్షించగలుగుతుందని మనం ఆశించలేం. 'అమెరికాతో పోరాటం చేయటం ప్రపంచం లోని ఇతర న్యాయస్థానాలకు నష్టంకలిగించగలదు' అని ఐసిసి ప్రధాన విచారణాధికారి పేర్కొన్నాడు. అంతర్జాతీయ న్యాయవ్యవస్థలపై అమెరికా పరపతి, ఆధిపత్యం, అదుపు ఈ విధంగా వుండి తన ప్రయోజనాలకు అనుగుణంగా వాటి నోరుమూయించ గలుగుతోంది.

కనుక, అమెరికాను 'ప్రజాస్వామ్య స్వర్గం'గానో లేదా 'మానవహక్కుల, ప్రజాస్వామ్య హక్కుల యోధుని' గానో భావించి ఎవరూ, ఏరకమైన భ్రమలలో వుండి పోవల్సినఅవసరంలేదు. సామ్రాజ్యవాద అమెరికా చేసే భారీ తప్పుడు ప్రకటనలతో మోసానికి గురికావలసిన అవసరంలేదు. కానీ 'మానవత్వానికి విరుద్ధమైన క్రూర ప్రభుత్వానికి' నమూనాగా అమెరికాను పరిగణించే అవగాహనను పెంపొందించుకోవటం అత్యావశ్యకం. ✡

టి సి ఎస్ సీనియర్ ఉద్యోగులను ఊబిలోకి నెట్టివేసిన యాజమాన్యం

టాటా కన్సలెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) లో టాటా కుటుంబసభ్యులే 73.7 శాతం వాటాలను కలిగివుండి, వారే ఈ కంపెనీ యజమానులుగా వున్నారు. భారతదేశంలో ఐటి సేవలనందిస్తున్న కంపెనీలలో ఇదే అతి పెద్దది. ప్రపంచ వ్యాపితంగా కంపెనీల 'బ్రాండ్‌ల' విలువకట్టే ప్రముఖ సంస్థ అయిన బ్రాండ్‌ఫైనాన్స్ నివేదిక ప్రకారం 2014 సంవత్సరానికిగానూ ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన నాలుగు విశిష్ట సేవలందించే కంపెనీలలో టిసిఎస్ ఒకటిగా వుంది. ఐబిఎమ్, యాక్సెంచర్, హెవ్‌లెట్‌పాకార్డ్ – మిగతా మూడు కంపెనీలుగా వున్నాయి. 2013లో 520 కోట్ల డాలర్లుగా వున్న టిసిఎస్ బ్రాండ్ విలువ 2014 నాటికి 820 కోట్ల డాలర్లకుచేరుకొంది.

భారత ఐటి సేవారంగ పరిశ్రమలకు తానే పునాదివేశానని టిసిఎస్ ప్రకటించుకుంటోంది. భారతదేశంలోని ఐటి సర్వీసుల పరిశ్రమలలో అత్యధిక ఉద్యోగకల్పనా సంస్థగా టిసిఎస్‌ను పరిగణిస్తారు. ప్రస్తుతం టిసిఎస్ సంస్థల్లో 3,13,757 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

2014 ఆర్థిక సంవత్సరానికిగానూ టిసిఎస్ ఆదాయం రూ. 81,809 కోట్లు. 2009 మార్చి తర్వాత, తమవద్ద పోగుబడిన ఆదాయంలో నుండి టిసిఎస్‌తోసహా అనేక అప్రకటిత కంపెనీలలో టిసిఎస్ కంపెనీ18,500 కోట్ల రూ॥ల మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టింది. ఈ కాలంలో టిసిఎస్ డివిడెండ్ల రూపంలో 16 వేల కోట్ల రూ॥ ఆర్జించింది. (వర్తమాన ఆర్థిక సంవత్సరంలోని మొదట త్రైమాసికంలో టిసిఎస్ యొక్క మధ్యంతర డివిడెండ్ కలపకుండానే) అంటే టిసిఎస్‌లో పెట్టిన పెట్టుబడికి దాదాపు సమానమైన మొత్తాన్ని అది ఆర్జించింది. 2015 ఆర్థికసంవత్సరానికి గానూ ఇంతకుముందెన్నటికంటే అత్యధిక డివిడెండ్‌ను ప్రకటించింది. దీని కారణంగా టిసిఎస్ దాదాపు 9,400 కోట్ల రూపాయాలు ఆర్జించి ఇందులో అతపెద్ద లబ్ధిదారునిగా వుంది. షేరుమార్కెట్టులో ఒక్కో టిసిఎస్ వాటా ధర 1,198.97 రూ॥గా ప్రారంభమైంది. 2004లో 1000 వాటాలను కొనుగోలు చేసిన వాటావారుడు 2015 జనవరి 15 నాటికి, ఒక కోటీ 3 లక్షల విలువగల 4 వేల వాటాలకు పెంపొందాడు.

టిసియస్ మరియు దాని వాటాదారుల ఈ సంపదంతా, గత అనేక సంవత్సరాలుగా రాత్రనకా పగలనకా అంకితభావంతో పనిజేసిన కంపెనీ ఉద్యోగుల శ్రమవలననే పోగుపడిందనేది నిర్వివాదమైన విషయం. పైగా, టిసియస్ కంపెనీ తాను చెల్లించ వలసిన కార్పొరేటు ఆదాయపన్నులో అనేక సబ్సిడీలను, పెద్ద మొత్తాల్లో రాయితీలను పొందింది; ఇప్పటికీ పొందుతూ వస్తోంది కూడా. 2010–11 నుండి 2013–14 స॥ల మధ్యకాలంలో టిసిఎస్ కంపెనీ పన్ను రాయితీల రూపంలో 9,179 కోట్ల 50 లక్షల రూ॥ లబ్ధి పొందింది. ప్రభుత్వానికి కంపెనీ చెల్లించవలసిన ఆదాయపన్నులో ఇది దాదాపు 41 శాతానికి సమానం. టిసిఎస్ కంపెనీ ఉద్యోగావ కాశాలను కల్పిస్తూవుందని, ఎగుమతులను పెంచుతూ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తుందని పేర్కొంటూ భారత ప్రభుత్వం టిసిఎస్ కంపెనీకి ఈ రాయితీలను, సదుపాయాలనన్నీ కలగజేస్తోంది.

ఏమైనా, టిసిఎస్ కంపెనీలో 5 నుండి 15 సంవత్సరాల కాలంపైగా అనుభవం కలిగిన ఆ సంస్థ ఉద్యోగులపట్ల యాజమాన్యం అనుసరిస్తోన్న నీతిబాహ్య, నిజాయితీరహిత కార్మిక విధానాలు, ఆచరణల ద్వారా ఉద్యోగావకాశాలను టిసిఎస్ కల్పిస్తోందనే అభిప్రాయం తుడిచిపెట్టుకుపోతోంది.

ఈనాడు టిసిఎస్ సీనియర్ ఉద్యోగుల పట్ల టిసిఎస్ యాజమాన్యం అనుసరిస్తున్న పద్ధతిని గమనిస్తే కూడా, ప్రపంచాన్ని మోసగించేందుకు టిసిఎస్ ఆకర్షణీయమైన నినాదాలను వల్లెవేస్తూ మరోవైపున అతి క్రూరంగా, అమానవీయంగా వ్యవహరిస్తోందని అర్థమౌతుంది. అది కార్మికుల శ్రమశక్తిని, మేధో శ్రమలను కొల్లగొట్టడం ద్వారా వృద్ధిచెందుతోన్న పెట్టుబడిదారీ సంస్థ అని తేటతెల్లమౌతుంది. మరో మాటల్లో చెప్పాలంటే ప్రపంచమంతటిపైన రుద్దబడిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆదేశిస్తున్న దుర్మార్గమైన నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలనే టిసిఎస్ కూడా అమలుచేస్తూ వస్తోందని స్పష్టమౌతుంది.

2014 డిసెంబర్ 8వ తేదీన, 10 నుండి 15 సంవత్సరాల అనుభవం కలిగిన తన కంపెనీలో పనిచేస్తున్న దాదాపు 25 వేలమంది సీనియర్ ఉద్యోగులను తొలగిస్తున్నట్లుగా తెలియజేస్తూ టిసిఎస్ యాజమాన్యం వారికి నోటీసులు జారీచేసింది. ఉద్యోగులను తొలగించే ఇలాంటి నోటీసులను అంద జేయటానికి టిసిఎస్ యాజమాన్యం ఏవిధమైన చట్టబద్ధ విధానాలనూ పాటించలేదు. 'పని సామర్థ్యపు వ్యవస్థ' అనే పద్ధతి ద్వారా టిసిఎస్ యాజమాన్యం తన సిబ్బంది నంతటినీ 'పునర్వ్యవస్థీకరించే' క్రమంగా చెప్పబడే విధానం యొక్క అమలులో భాగంగానే ఉద్యోగుల తొలగింపు జరిగిందనే ఒకే ఒక్క కారణాన్ని మాత్రమే పేర్కొంటోంది. మరోమాటల్లో చెప్పాలంటే, పనితీరు సరిగాలేదనే సాకుతో టిసిఎస్ యాజమాన్యం మూకుమ్మడిగా తన ఉద్యోగులను తొలగించి వేసిందని స్పష్టమౌతోంది.

ఆశ్చర్యకరమైన విషయమేమంటే, తొలగించ బడినవారిలో అనేకమంది ఉద్యోగులు వారి ఉద్యోగ జీవితంలో ప్రతిభావంతమైన సేవలందించినందుకు గాను ఉన్నతహోదాలకు పంపబడటంతోపాటు, మరి అనేకమంది 'టిసిఎస్ రత్నాలు'గా పరిగణించబడి గత సంవత్సరం టిసిఎస్ యాజమాన్య పురస్కారాలు కూడా అందుకున్నారు.

ఈ విధంగా, టిసిఎస్ యాజమాన్యం కేవలం ఒక సాధారణ నోటీసుతో (కార్పొరేటు పరిభాషలో 'పింక్‌స్లిప్'తో) ఒక్కవేటుతో 25 వేలమంది కార్మికులను, వారిపై ఆధారపడిన వారి కుటుంబ సభ్యులను వారి విద్యార్హత, అనుభవం, ప్రతిభకు తగిన ఏ విధమైన ఉద్యోగమూ లేకుండా రోడ్లపైకి విసిరి పారేసింది. వీరిలో అనేకమంది కొత్త ఉద్యోగాలు చూసుకోలేని స్థితిలో వుండగా, మరికొందరు ఎంతో తక్కువ వేతనాలు, సదుపాయాలతోనున్న చిన్న చిన్న ఉద్యోగాలు చేయవలసిన స్థితికి నెట్టబడ్డారు.

చట్టవిరుద్ధంగా తొలగించబడిన వారిలో ఒకరో ఇద్దరో టిసిఎస్ ఉద్యోగులు తమ తొలగింపులను సవాల్‌జేస్తూ మద్రాసు హైకోర్టునూ, హైదరాబాద్ హైకోర్టునూ ఆశ్రయించగా, సాంకేతిక కారణాలపై వారికి తాత్కాలిక ఉపశమనం లభించింది. అంతే తప్ప, ఆ విధంగా తొలగింపబడిన ఉద్యోగులందరినీ పరిరక్షించగలిగే ఏదేని విధానంపైనో, లేదా చట్టం యొక్క గొప్పతనంపైనో ఆధారపడి ఆ తీర్పు వెలువడలేదు.

మరో మార్గాంతరం కానక, లేదా తమ ఉద్యోగాలను తిరిగి పొందగలిగే ఎటువంటి అవకాశమూ లేక తొలగించబడిన అనేకమంది ఉద్యోగులు వివిధ సామాజిక మాధ్యమాలలో తమ గోడు వెళ్ళబోసుకున్నప్పటికీ ఫలితమేమీ లభించలేదు. మరి కొంతమంది ప్రధానమంత్రి మోదీకి తమ మొర ఆలకించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటిరకు అటువైపునుండి కూడా సానుకూల చర్యల సంకేతాలేమీ లేవు. ఎన్‌డిఏప్రభుత్వ కార్మికశాఖామంత్రి మాట్లాడుతూ ఇటువంటి అంశాలతో రాష్ట్రప్రభుత్వమే వ్యవహరించ వలసి వుంటుందని చాలా తాపీగా శలవిచ్చాడు. ఈ విధంగా చట్టవిరుద్ధంగా మూకుమ్మడిగా ఉద్యోగుల తొలగింపువంటి సమస్యల్లో ఇమిడివున్న గంభీరమైన అంశాలలో జోక్యం చేసుకొని పరిష్కరించటానికి బదులుగా దాని నుండి తప్పించుకోవటానికి ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఐ.డి. చట్టంతో సహా అనేక చట్టాలు అందుబాటులో వున్నాయంటూ ఆయన 'పండిత' సలహాలివ్వటానికి పరిమితమయ్యాడు.

ఈ విధమైన ఉద్యోగుల మూకుమ్మడి తొలగింపులపై టిసిఎస్ యాజమాన్యాన్ని ప్రశ్నించగా, టిసిఎస్ సిఇఓ మరియు ఎమ్.డి. అయిన ఎన్. చంద్రశేఖర్ దీనిని నిర్ద్వందంగా నిరాకరిస్తూ, ఇవి మూకుమ్మడి తొలగింపులు కానే కావన్నాడు. ఆయన 'ఈ తొలగింపుల వెనుక, సమస్యలను సృష్టించి బలహీనపరిచే ప్రక్రియ ఇమిడివుందని చెపుతూ ఈ విధంగా బలహీనపరచటాన్ని నిర్బంధంగా తొలగించటం కంపెనీలకు కొత్తకాద'ని ఇది ఓ సహజ ప్రక్రియగా పేర్కొంటూ తమ ఉద్యోగుల తొలగింపులను సమర్థించు కున్నాడు. టిసిఎస్ యాజమాన్యం సంవత్సరంలో రెండు పర్యాయాలు మదింపు ప్రక్రియగా చెప్పబడే పద్ధతితో ఉద్యోగుల పనితీరును అంచనా కడుతుందని, దానికనుగుణంగా ప్రతి ఉద్యోగికీ అతని సామర్థ్యశ్రేణి ఇవ్వబడుతుందని, దానిని మరింత మెరుగుపరుచుకునే చొరవ చేయలేని ఉద్యోగులను, యాజమాన్యం బయటకు పంపించి వేస్తుందని, ఈ విధంగా పనితీరు మెరుగుపరుచుకోనివారు బయటకు వెళ్ళవలసి వుంటుందని ఆయన నొక్కి చెప్పాడు.

అయితే, గంభీర పదాలతోనున్న ఆధునిక పని సామర్థ్య వ్యవస్థల గురించి అందులో ఇమిడివున్న జటిలత్వాల గురించి ఏ మాత్రం అవగాహనలేని సామాన్యుడు కూడా చాలా తేలిగ్గా ఈ ప్రశ్నలు అడుగ గలుగుతాడు : ఈ తొలగించబడిన కార్మికులందరూ పనిసామర్థ్యము సరిగా లేకున్నవారే అయితే, టిసిఎస్‌కు అంతటి ఆదాయం ఏవిధంగా సమకూడింది? ఒక్కో ఉద్యోగి సగటున 2007–08లో 0.2095 కోట్ల నుండి 2013–14 నాటికి 0.2722 కోట్లకు ఆదాయాన్ని ఎలా పెంచగలిగాడు? ఈ ఉద్యోగుల జీతాలు – లాభాలు లేదా కనీసం ద్రవ్యోల్బణరేటు కనుగుణంగా ఆ నిష్పత్తి ప్రకారమైనా పెరిగాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలను సరిగ్గా, వాస్తవికంగా నిర్ధారించుకో గలిగితే, టిసిఎస్ యాజమాన్యం తన వనరులను ఉద్యోగులపై వెచ్చించి వృథా చేసుకుంటుందనే వాదన నిరాధారమైనదని, ఆమోదయోగ్యం కానిదని అర్థమౌతుంది. అలాగే, టిసిఎస్ యాజమాన్యం సీనియర్ ఉద్యోగులను తొలగించేందుకు వారిని పని సామర్థ్యంలేని ఉద్యోగులుగా చిత్రించటమనే ఓ సాకును కనుగొన్నదనీ స్పష్టమౌతుంది.

ఈ తీరు – ఇళ్ళలోని జంతువుల చేత వాటికి శక్తి వున్నంతకాలం చాకిరీ చేయించుకొని, శక్తి వుడిగిన తర్వాత వాటిని గాలికొదిలేయటం లేదా వధ్యశాలలకు తరలించిన విధంగా వుంది.

టిసిఎస్ యాజమాన్యం మరోవైపున 'రానున్న ఆర్థిక సంవత్సరంలో 55 వేలమందిని టిసిఎస్ ఉద్యోగాలలోకి తీసుకోవాలనే లక్ష్యం పెట్టుకుంద'ని ప్రకటనలు చేస్తూ వస్తోంది. ఈ రకమైన ప్రకటనలతో టిసిఎస్ యజమాన్యం మూకుమ్మడిగా ఉద్యోగులను తొలగించిన తన చట్ట విరుద్ధ చర్య నుండి విముక్తం కాబోదు.

సీనియర్ ఉద్యోగులను తొలగించి నూతనంగా కళాశాల విద్య పట్టభద్రులైనవారిని కళాశాల ఆవరణల లోనే ఎంపిక చేసుకొని, వారిని ఉద్యోగులుగా చేర్చుకోవటంలోనే, ఉద్యోగుల శ్రమను సరికొత్త రూపాలలో దోపిడీ చేసుకోవటమనేది ఖచ్చితంగా ఇమిడి వుంది. ఇక్కడే టిసిఎస్ యొక్క తప్పుడు వ్యవహారం వెల్లడవుతోంది. ఈ రోజుల్లో ఉద్యోగులకు కల్పించబడిన వేతనాల చెల్లింపులు, సదుపాయాల జాబితా మొదలైనవాటి అన్నింటినీ ఉద్యోగితాలూకూ 'కంపెనీ ఖర్చు' (సిటిసి) అనే కార్పొరేటు పదజాలంతో పేర్కొంటూ, దీనిలో ఇమిడివున్న మౌలిక విషయాలను గందరగోళపరుస్తున్నారు. 'కంపెనీ యొక్క ఖర్చు'గా వ్యవహరించే ఈ విధానం, ఉద్యోగులను మానవులుగా పరిగణించకుండా, తమ లాభసముపార్జనకు వ్యాపార క్రమంలో ఉపయోగించే ఇతర సామాగ్రి లాగానే వారిని పరిగణిస్తుంది. మానవులు చేసే శ్రమశక్తిని, సరుకు తయారీకి అవసరమైన ఇతర ముడిపదార్థాలను వేరుచేసి, మానవశ్రమను భిన్నమైనదిగా గుర్తించటాన్ని ఈ పద్ధతి నిరాకరిస్తుంది. ఈ విధంగా నయా ఉదారవాద దృక్పథం, వ్యాపార సామాగ్రికి మించి మానవులకు మరేమాత్రమూ విలువనివ్వలేదు. కనుకనే తన ఉద్యోగులను తొలగించటం ద్వారా 'కంపెనీ ఖర్చు'ను తగ్గించివేసి, టిసిఎస్ యాజమాన్యం తన సీనియర్ ఉద్యోగులను పారద్రోలింది. కళాశాలల్లో అప్పుడే పట్టభద్రులైన వారిని ఉద్యోగాలలోకి తీసుకొని, సీనియర్ ఉద్యోగుల స్థానంలో వీరికి తక్కువ వేతనాలు, సదుపాయాలు కల్పించి, నూతనంగా అభివృద్ధిచెందిన, నైపుణ్యజ్ఞానంతో నున్న వీరిని కారుచౌక కూలీలుగా ఉపయోగించుకోనుంది. తిరిగి ఈ నియమింపబడిన ఉద్యోగులు సీనియర్లు అయితే, నిర్దాక్షిణ్యంగా వారు కూడా గెంటివేయబడతారు. ఆటోమాటిక్‌గా ఈ క్రూరమైన ప్రక్రియ ప్రతిసంవత్సరం పునరావృతమౌతూ సీనియర్ ఉద్యోగుల జీవితాలలో, జీవనాధారాలలో విధ్వంసం సృష్టిస్తుంది. 'కార్పొరేటు సామాజిక బాధ్యత'గా చెప్పబడే దాన్ని గురించి యాజమాన్యాలు ఎంత ఘనంగా మాట్లాడినప్పటికీ, వారికి సర్వసంపదలు సమకూర్చటంలో సాధనాలైన ఉద్యోగుల, కార్మికుల సంక్షేమం గురించి, వారి మానవ అవసరాలు, ఆకాంక్షల గురించి వారు అస్సలు పట్టించుకోరు. దీనిని కప్పిపుచ్చుకునేందుకే లోకోపకార కార్యక్రమంగా – మానవత్వంతోనూ మానవ పురోగమనంతోనూ ప్రత్యేకించి సంపద సృష్టికర్తలైన ఉద్యోగుల, కార్మికుల తోనూ ఎలాంటి సంబంధంలేని ఆడంబర పదజాలంతో, నినాదాలతో ఈ సమస్యలో ఇమిడివున్న కీలకమైన, వాస్తవిక రోగలక్షణాల నుండి దృష్టిని మళ్ళిస్తున్నాయి.

వాస్తవానికి నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అత్యంత నేర్పుగా కార్పొరేట్ సంస్కృతి పేరిట ఐటి విభాగపు ఉద్యోగులను 'టెక్నోక్రాట్స్'గా పిలుస్తూ ఇతర ప్రజానీకం నుండి ప్రత్యేకించి కార్మికులు, కార్మికవర్గం నుండి వేరు చేశాయి. నిజానికి 'టెక్నోక్రాట్స్' అంటే మేధోశ్రమజీవులు మినహా వేరుకాదు. ఐ.టి. విభాగపు ఉద్యోగులందరినీ సాధారణ ప్రజానీకం కంటే, కార్మికుల కంటే వారొక విభిన్న (ఉన్నత) తరగతి చెందినవారిగా ఒక పద్ధతి ప్రకారం బోధనలు చేయటం ద్వారా, అలాంటి భ్రమను వారు కూడా విశ్వసించేలా చేశారు. ఈ ఐటి ఉద్యోగుల ఆలోచనలన్నీ ఏ విధంగా నియంత్రించబడినాయంటే, తామంతా ఐక్యంగా ఓ యూనియన్నో లేదా సంఘాన్నో ఏర్పాటు చేసుకోవటం వారి స్థాయిని తక్కువచేసేదిగా, 'బ్లూకాలర్' కార్మికులతో సమానం చేసేదిగా వుంటుందని తమకు తామే అభిప్రాయపడుతూ, ఆవిధంగా నిజానికి వారి సామాజిక స్థాయిని దిగజార్చుకున్నారు. అలాగే, పూర్తి స్థాయి రక్షణ, భద్రతలతో సమాజంలోని ఓ ఉన్నతవర్గానికి చెందినవారుగా తమకు తామే భావించుకునే విధంగా వారి ఆలోచనలు మలచబడ్డాయి. కనుక, వారంతా ఈ విధంగా నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల, బోధనల వలన కడు నేర్పుగా మానసికంగా నిరాయుధం గావించబడ్డారు. వారియొక్క ఈ రకమైన భ్రమే గుడ్డిగా వారు ఓ నిస్సహాయస్థితిలో పడిపోయేట్లు చేసింది.

సాంకేతికంగా విద్యావంతులైన కార్పొరేటు ఉద్యోగులంతా–తమ పరిభాష ఏదైనప్పటికీ, తామంతా ప్రజానీకంలో విడదీయరాని భాగమనీ, ఉద్యోగుల శ్రమను పిండుకోని సూపర్ లాభాలను గడించాలనే ఏకైక ఉద్దేశ్యంతోనున్న యాజమాన్యం క్రింద తాము కూడా కార్మికులమేననీ, వేళ్ళాడుతున్న కత్తి ఏ క్షణాన్నైనా తమ మెడపై పడేటువంటి ప్రమాదముందనే సవాళ్ళను, యాజమాన్యం తమకు వ్యతిరేకంగా చేపట్టే చర్యలను, ప్రస్తుతం మూకుమ్మడి ఉద్యోగుల తొలగింపు వంటి ఉమ్మడి సమస్యలను ఎదుర్కోని పోరాడవలసి వుంటుందని గ్రహించాలి. తమ ఉద్యమానికి, కార్మికుల, శ్రమజీవులందరి సంఘీభావాన్ని కూడగట్టడం ద్వారా మాత్రమే ఐటి కంపెనీల యాజమాన్యాలయొక్క, ప్రస్తుతం టిసిఎస్ యజమాన్యం యొక్క ఉద్యోగుల మూకుమ్మడి తొలగింపు చర్యలను ఓడించి విజయ వంతం సాధించటంలో కృతకృత్యులు కాగలుగుతామనే అవగాహనను ఐటి ఉద్యోగులు పెంపొందించుకోవాలి.

కనుక ఐటి విభాగ ఉద్యోగులంతా మొదట ఒక సంఘంగా ఏర్పడి, ఉద్యోగుల ఉమ్మడి సమస్యలపైన, ఐటి పరిశ్రమ యాజమాన్యపు మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి. ఈ సమస్యకు ఒక ఆమోద యోగ్యమైన పరిష్కారం కోసం, తొలగింపబడిన టిసిఎస్ ఉద్యోగులు జరిపే న్యాయమైన పోరాటానికి భారత కార్మికవర్గం తన సంఘీభావాన్ని అందజేయాలి.

ఐటీ విభాగ ఉద్యోగులందరూ వారందరి ఉమ్మడి సమస్యపై పరిస్థితుల కనుగుణంగా వ్యవహరించి, ఐక్యంగా నిలుస్తారని ఆశిద్దాం. ✡

పరుచూరి హనుమంతరావుగారికి జోహార్లు



ప్రముఖ ప్రచురణ సంస్థ 'ప్రగతి ప్రింటర్స్' వ్యవస్థాపకులు, శ్రీ పరుచూరి హనుమంతరావుగారు (92 సం॥లు) 2-3-2015న హైదరాబాద్‌లో మరణించారు. ('జనశక్తి' ప్రచురణకు సిద్ధమైన సమయంలో ఈ వార్త వెలువడింది)

పరుచూరి హనుమంతరావుగారికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జోహార్లర్పిస్తోంది. వారి సతీమణి శ్రీమతి సీతాలక్ష్మిగారికి, మరియు ఇతర కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ పరుస్తున్నాము.

విజయవాడ
2-3-15

యస్. ఝాన్సి
అధ్యక్షులు
రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)

నూతన రోడ్డురవాణా భద్రతా బిల్లు మోటారువాహన చోదకులైన సామాన్య ప్రజల, డ్రైవర్లపాలిట ఉరితాడు

దేశంలో ప్రభుత్వాలు మారుతున్నాయి. ఒక పాలకపార్టీ స్థానంలోకి మరొక పాలకపార్టీ అధికారం లోకి వస్తోంది. కానీ దేశపు జనజీవన పరిస్థితులు మాత్రం మెరుగవటల్లేదు. పైగా పాలకులు అమలు జరుపుతున్న పలు ప్రజావ్యతిరేక విధానాలవలన ప్రజల జీవన స్థితిగతులు నానాటికీ దిగజారిపోతున్నాయి.

ఎన్నో ఆకర్షణీయమైన ఎన్నికల వాగ్దానాలను గుప్పించి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నాయకత్వాన గల బిజెపి ప్రభుత్వం ఆ వాగ్దానాలను అమలుచేయటం మాట అటుంచి, తాను అధికారానికి రావటానికి ముందునెలకొన్న అధ్వాన్న పరిస్థితులను సహితం మరింత అధ్వాన్నపరిచే, ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందించి అమలు జరుపుతోంది. ప్రజావ్యతిరేకమయిన చట్టసవరణలకు పాల్పడుతోంది. కొత్త చట్టాలను తీసుకవస్తోంది. ఇవన్నీ కూడా దేశాభివృద్ధి కోసమేనంటూ దబాయిస్తూ, ప్రజలను చాకచక్యంగా వంచిస్తోంది.

గత యుపిఎ పాలకులు అనుసరించి అమలు జరిపిన ప్రజావ్యతిరేక విధానాలనే మరింత పట్టుదలతో, మరింత వేగంతో అమలుజరుపుతోంది. దేశవ్యతిరేక, ప్రజావ్యతిరేక సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడిదారులైన కార్పొరేటు రంగ సంస్థలకు లాభంచేకూర్చే అభివృద్ధి నిరోధక విధానాలను, తనకు పార్లమెంటులో వున్న మొరటు మెజార్టీతో దేశంపైనా, ప్రజానీకంపైనా రుద్దుతోంది.

విదేశీ పెట్టుబడికి రక్షణ, బీమా, రిటైల్‌రంగాలలో వున్న పరిమితులను ఎత్తివేసి ఆయా రంగాలలో విదేశీ పెట్టుబడి మరింతగా దోపిడీ చేసుకోవటానికి అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఆధీనంలో భారీరంగంగా వున్న రైల్వేలలో విదేశీపెట్టుబడి చొరబాటుకూ, ప్రవేటీకరణకూ మార్గంవేసి పెట్టింది. భారత కార్మికవర్గం తన రక్తతర్పణతో, అనంతమైన త్యాగాలతో ఎనలేని పోరాటాలను సల్పి సాధించుకొన్న కార్మికహక్కులను, కార్మికచట్టాల సంస్కరణపేరిట – ఆ చట్టాలకు సవరణ జరిపి హరించివేసింది. మరిన్ని కార్మిక చట్టసవరణలు – కుదింపుల ద్వారా మరింతగా కార్మికుల హక్కులను హరించివేసే యత్నంలో వున్న విషయాన్ని పదేపదే ప్రకటిస్తోంది. భూయజమానులైన రైతాంగం నుండి బలవంతంగా భూములను గుంజుకొని బడా పారిశ్రామిక వర్గాలకు ధారాదత్తం చేయటానికి – భూసేకరణ ఆర్డినెన్సును చేసి, అమలులోకి తెచ్చింది. నూతన బిజెపి ప్రభుత్వం పాలనలోకి వచ్చి ఎనిమిది మాసాలు దాటుతున్నా ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు దిగిరాకపోగా యింకా పెరుగుతూనే వున్నాయి. పెట్రోలు ధరపై నియంత్రణ ఎత్తివేశామన్న తర్వాత కూడా, అంతర్జాతీయ మార్కెట్టులో గణనీయంగా చమురు ధరలు తగ్గిపోయినా, అటు కేంద్రప్రభుత్వం – యిటు రాష్ట్రప్రభుత్వాలూ, వివిధ రూపంలో పరోక్షపన్ను (ఎక్సైజు, వ్యాట్ మొ॥)లు వేస్తూ, లేదా పన్నులను పెంచుతూ, తగ్గిన పెట్రోలు ధరల విలువను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కైంకర్యం చేస్తున్నాయి. ద్రవ్యోల్బణం రోజురోజుకీ పెరిగి సామాన్య ప్రజల సంపాదన విలువను కుదించి వేస్తున్నాయి. ఇవన్నీ చాలవన్నట్లు యిప్పుడు మూల్గే నక్కమీదకు తాటిపండు విసిరినట్లు కేంద్రప్రభుత్వం రోడ్డురవాణా మరియు భద్రతా బిల్లు–2014 పేరిట, మరో భారాన్ని మోటారు వాహన చోదకులుగా వున్న మధ్యతరగతి, కార్మికవర్గ ప్రజానీకంపైకి చట్టం చేసే రూపంలో విసిరారు.

వాస్తవానికి ఈ చట్టం భద్రతతో కూడిన రోడ్డు రవాణా వ్యవస్థను ఏర్పాటుచేసే దిశగాకాక, మోటారు వాహన చోదకులైన మధ్యతరగతి ప్రజలనుంచి బస్సు–లారీ–ఆటోడ్రైవర్లయిన కార్మికులను జరిమానాల రూపంలో దోచుకొని, జైలుశిక్షలుద్వారా తమ అదుపులో పెట్టుకునే వైపుగా, ప్రజలకు (వాహనచోదకులకు) వున్న కనీసపు స్వేచ్ఛను కూడా హరించే దురుద్దేశంతో చేయబడిందని అర్ధమవుతోంది.

ఈ చట్టం వలన రోడ్డు ప్రమాదాలకు – రోడ్డు రవాణాకూ కారణమైన ప్రధాన అంశాలు నిర్మూలింప బడవు, రోడ్డు–రవాణా ప్రమాదాలు నివారించబడవు, నిజమైన అర్ధంలో రోడ్డురవాణాకు భద్రత కల్పించ బడదు. మహా అయితే కొందరు వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేస్తాయి. వాహన చోదకులు నిర్భయంగా, ధైర్యంగా తమ వాహనాలను నడిపే వాతావరణాన్ని ఈ చట్టం మృగ్యంచేస్తుంది.

దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అందుకు యీ క్రింది కారణాలు ప్రధానమైనవిగా వెల్లడవుతోంది.

గత 25 సంవత్సరాలుగా పాలకులు అవలంబించి, అనుసరించిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలే రోడ్డురవాణా అభద్రతకు ప్రధాన కారణంగా వుంది. దేశంలోని ప్రజల అవసరాలకు మించి యిబ్బడిముబ్బడిగా మోటారు వాహనాలను ఉత్పత్తి చేయటానికి ప్రభుత్వం అనుమతులు – ప్రోత్సాహకాలు యిచ్చిన దాని ఫలితమే ఈ రోడ్డురవాణా అభద్రతకు మూలకారణం. మార్కెట్టులోకి విపరీతమయిన సంఖ్యలో మోటారు వాహనాలను విడుదలచేసి, ఆఖరుకు అవి కొనుగోలు చేయటానికి తాహతులేని వారికి సహితం ఆ కంపెనీలే రుణాలు యిచ్చి తమ వాహనాలను అమ్ముకోవటం – ఆరకంగా సూపర్ లాభాలను ప్రజల నుండి దండు కోవటానికి ఆ విదేశీ లేదా ఆ విదేశీ కార్పొరేషన్లతో మిలాఖతైన స్వదేశీ దళారీ కార్పొరేషన్లకు ఎనలేని అవకాశాలు కల్పించటమే ఈ రోడ్డు – రవాణా అభద్రతకు కారణం. ఈ వాతావరణం ఆయా కార్పొరేషన్లు తాము ఉత్పత్తిచేసే వాహనాలకు భద్రతా పరమైన నిబంధనలను అమలుజరపకుండా, ప్రమాదాలకు గురిచేసే వాహనాలను మార్కెట్లలో నింపడానికి ప్రేరణనూ, ప్రోత్సాహాన్నీ యిచ్చింది. అందువల్లనే భద్రతా ఏర్పాట్లను ఉల్లంఘించిన వాహనాలు రోడ్లపైకి పంపబడుతున్నాయి. జరిగే రోడ్డు ప్రమాదాలలో – చిన్నకార్లు, మోటారుసైకిళ్ళు, వోల్వోబస్సులు – ట్రక్కుల్లాంటి భారీ వాహనాలలో డిజైను లోపంకల వాహనాలే ప్రమాదాలకు గురవుతున్నా యన్నది గణాంకాలు వెల్లడిస్తున్న సత్యం. ఇటీవల జి.యం., మారుతీలాంటి బడాకంపెనీలు అనేక వాహనాలను మార్కెట్టు నుండి వెనక్కు రప్పించుకొంటున్న ఉదంతాలు, ఈ కారణంవల్లనే. రవాణా అవసరానికి మించిన హైస్పీడు, సూపర్‌స్పీడ్, సూపర్‌పవర్ బైక్‌లను మార్కెట్టులోకి ప్రవేశపెట్టడం, వాటిని అదుపుచేయటం కుదరని – సాధ్యంకాని కారణంచేత జరిగే మోటారు వాహనాల ప్రమాదాలే దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ సంఖ్యంలో వున్న వాస్తవాన్ని కూడా గణాంకాలు వెల్లడి చేస్తున్నాయి.

మార్కెట్టులోకి విడుదల చేయబడుతున్న అసంఖ్యాక వాహనాలు క్షేమంగా తిరగటానికి వీలైన రోడ్లు–రహదారుల వ్యవస్థ, అవసరానికి తగినంత మేరకు లేకపోవటం కూడా ఈ రోడ్డు ప్రమాదాలకు కారణంగా వుంది. నిజానికి పాదచారులూ, మోటారు వాహనాలుకాని యంత్రవాహనాలు–బళ్ళు, సైకిళ్ళు, సైకిల్–రిక్షాలూ, లాగుడుబళ్ళూ నడవటానికి తగిన విధంగా రోడ్ల–రహదారుల వ్యవస్థ రూపొందింపబడక పోవటం కూడా రోడ్ల అభద్రతకూ, మోటారువాహనాల ప్రమాదాలకూ కారణంగా వుంది.

అంతేకాక ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని పెంచుకోవటంకోసం మోటారు వాహన చోదకులను మద్యపానంవైపు ఆకర్షిస్తూ, ప్రధాన రహదారుల ప్రక్కనే వైన్‌షాపులూ, బార్లు నెలకొల్పటానికి అవకాశం యిచ్చిన విధానం కూడా–రోడ్డు ప్రమాదాలకు మరొక కారణంగా వుంది.

ఇక ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ అన్నది నిజమైన అర్థంలో మనదేశంలో లేదన్నది ఎంతమాత్రమూ అబద్ధంకాదు. ఉన్న ట్రాఫిక్ వ్యవస్థఅల్లా కేవలం పలుకుబడి లేనివారనీ అమాయకులనూ వేధిస్తూ జరిమానాలు విధిస్తూ లేదా లంచాలు స్వీకరిస్తూ గడిపేసే వ్యవస్థే కొనసాగుతోంది. ఇటువంటి అసమంజస ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థకూడా రోడ్డు ప్రమాదాలకు కారణంగా వుంది.

డ్రైవర్లు అప్రమత్తంగా లేకపోవటంవలన జరిగే రోడ్డు ప్రమాదాలలో కూడా, సంబంధిత డ్రైవర్లు విశ్రాంతి లేకుండా తదేకంగా పనిచేయవల్సిన పరిస్థితులే – అధికంగా వారిపై యజమానులు రుద్దిన పనిభారమే – ప్రమాదాలకు కారణమన్న వాస్తవాన్ని కూడా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రోడ్డు రవాణా భద్రతకు ప్రమాదకరంగా పరిణమించిన ఈ మౌలిక కారణాలను సరిదిద్ది, నియంత్రించటానికి ఈ ప్రస్తుత చట్టం నామమాత్రంగా కూడా పూనుకోకపోగా, తక్కువ ప్రధానాంశమైన – ప్రమాదానికి డ్రైవరుదే బాధ్యతా – అంశాన్ని కీలకాంశంగా తీసుకొని, ఆ తప్పుడు అవగాహనపై ఆధారపడి డ్రైవర్లను వేధించి, శిక్షించి బలిచేసేందుకు అనుగుణంగా ఈ చట్టం రూపొందించబడింది.

"దురుసుగా, నిర్లక్ష్యంగా" నడపటం అనే కారణంతో – అది నిజమైనా, కాకపోయినా – రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిచేసే చట్టాన్ని నాటి బ్రిటిష్ వలసపాలకులు ప్రవేశపెట్టి, అదే చట్టాన్ని యిప్పటిదాకా అమలుచేస్తూ వస్తున్నారు. ప్రమాదానికి కారణం ఏదైనా అందుకు డ్రైవర్లనే దోషిగా పరిగణించటంఅన్నది ఒక అలవాటుగా–ఆచారంగా–నేడు నిర్ధారించబడివుంది. సరిగ్గా యిటువంటి అసంబద్ధపు, అశాస్త్రీయ అవగాహననే ఆధారంచేసుకొని, ప్రస్తుత చట్టం చేయబడింది. ఈ రకంగా రోడ్డురవాణా అభద్రతకూ, రోడ్డు ప్రమాదాలకూ కారణమైన అసలైన మౌలిక కారణాలను మరుగుపరచి, యిందుకు ప్రధాన కారకులైన బడాపెట్టుబడిదారులైన–మోటారు వాహన ఉత్పత్తిదారుల సూపర్–లాభార్జన ప్రయోజనాలను పరిరక్షిస్తూ, రోడ్డు భద్రతసాకుతో సామాన్య మోటారు వాహనచోదకులైన ప్రజలపైన, కార్మికులపైననే నింద మోపుతూ వారి నుండి భారీమొత్తాలు జరిమానాలు విధించి, రెవెన్యూ ప్రోగుచేసుకోవటం, శిక్షలు విధిస్తూ రోడ్డురవాణా అభద్రతకు వారినే బలితీసుకోవటం అన్నది ఈ క్రొత్త చట్టం యొక్క ఉద్దేశ్యం, లక్ష్యం అన్న వాస్తవం తేటతెల్లమవుతోంది.

ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తే, ట్రాఫిక్ సిగ్నల్‌ను ఉల్లంఘిస్తే, డ్రైవరుసీటు బెల్టుపెట్టుకోకపోతే, మద్యంసేవించి వాహనం నడిపితే, కాలుష్యం కలిగే మోటారు వాహనాలను నడిపితే, అతివేగంగా నడిపితే, ఉత్తర్వులు పాటించకపోతే మొదలైన సాకులతో – డ్రైవర్లపై భారీఎత్తు జరిమానాలు విధించటం, జైలుశిక్షకు గురిచేయటంలాంటి నిబంధనలతో ఈ చట్టం రోడ్డు – రవాణా భద్రతను కల్పించబోతున్నట్లు భ్రమకల్పించి, వంచన చేస్తోంది.

నిజానికి ఏ వాహన చోదకుడూ (డ్రైవరూ) తన ప్రాణప్రమాదాన్నో, అంగవైకల్యాన్నో కావాలని కొనితెచ్చుకొని ప్రమాదాలను చేయడు. ప్రమాదాలలో అత్యధికభాగం డ్రైవరు నియంత్రణ పరిధిలో లేని కారణాలవల్లనే జరుగుతున్నాయన్నది తిరుగులేని నిజం. అయినా అందుకు డ్రైవర్నే బలితీసుకొంటాననే చట్టం తేవటం అన్యాయం, దుర్మార్గం, ప్రజావ్యతిరేకం.

చిత్తశుద్ధిగల ఏ ప్రజాప్రభుత్వమూ యిటువంటి అపసవ్య, అసంగత, అక్రమ చట్టాన్ని చేయదు! అమలుజరపదు!

అలాకాకుండా యిటువంటి చట్టాన్ని కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్రప్రభుత్వం చేసిందంటే, అది ముమ్మాటికీ ప్రజావ్యతిరేక ప్రభుత్వమే.

ఇటువంటి ప్రజావ్యతిరేక చట్టాన్ని నిర్ద్వందంగా వ్యతిరేకించాలి. ప్రత్యేకించి ఈ ప్రజావ్యతిరేక రోడ్డు రవాణా భద్రతా నియంత్రణా చట్టాన్ని, దానిక్రింద ప్రధానంగా బలికాబోయే కార్మికవర్గం వ్యతిరేకించాలి! ప్రతిఘటించాలి! ఆ దుర్మార్గ చట్టం రద్దుకోసం సంఘటితంగా పోరాడాలి!

డ్రైవర్ల జీవనోపాధిని ధ్వంసంచేసి, వారిని బలితీసుకొనే యీ దుష్ట నూతన రోడ్డురవాణా భద్రతా బిల్లును ఉపసంహరించాలి.

కార్మికులు తమ మధ్యగల కుల, మత, ప్రాంతీయ, సంఘ, వృత్తి బేధాలన్నింటినీ ప్రక్కనబెట్టి సమైక్యంగా, దృఢమైన కార్మికవర్గ దృక్పథంతో, ఈ కార్మిక–ప్రజా–వ్యతిరేక చట్టం రద్దును కోరుతూ తక్షణమే ఉద్యమించాలి. ✡

'ఎస్‌టిఎం కంపెనీ భూములను గిరిజనులకు, పేదలకు పంపిణీ చేయాలి'

సంగంవలస, 15–2–15 :

విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం సంగంవలస గ్రామములో రైతుకూలి సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో బహిరంగసభ జరిగింది. ఈ సభకు రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షులు, బొత్స నర్సింగ రావు అధ్యక్షత వహించారు. ఈ బహిరంగసభలో రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ వాటాదార్లను మోసంచేస్తూ కొల్లగొట్టిన ఎస్‌టిఎం కంపెనీ ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఎస్‌టిఎం కంపెనీ భూములను ప్రభుత్వమే స్వాధీనపర్చుకొని గిరిజనులకు ఇతర పేదలకు పంచి పెట్టాలని కంపెనీ ప్రతినిధులు, దళారీలకు కటింగ్ ఆర్డర్‌లకు అనుమతి ఇవ్వకుండా నిలుపుదలచేయాలని, బంజరు, పోరంబోకు డి–పట్టా గెడ్డలను ఎస్టీఎమ్ కంపెనీ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు, పేదలకు, ఈ భూములను పంచిపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూముల కొనుగోలు సమయములో రైతులకు తక్కువ డబ్బు చెల్లించి మధ్యవర్తులు దళారులు డబ్బులు సంపాదించుకున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే కురుపాం ప్రాంతంలో 80శాతం టేకు మొక్కలు రవాణా అయినాయని, సంగంవలస ప్లాంటేషన్‌లో మొక్కలు తరలించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమములో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా ఉపాధ్యక్షులు బొత్స నర్సింగరావు, జిల్లా సహాయ కార్యదర్శి మోనంగి భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయుడు, కార్మిక సంఘం నాయకులు ఎమ్.గోపాలం పాల్గొన్నారు. ఈ బహిరంగసభకు, సంగంవలస, నడిమిగదబ వలస, మడకవానివలస, కోరి, గంగాపురం, పనసభద్ర, ఉక్కోడువలస, అడ్డూరు వలస, రాలికోనబట్టివలస తదితర గ్రామాల నుండి సుమారు 300 మంది హాజరైనారు. ✡

'విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించాలి'

బందరులో ధర్నా

బందరు, 16–2–15:

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించాలని పెట్రోలు, డీజిల్‌పై విధించిన ఎక్సైజ్, వ్యాట్ పన్నులను తక్షణమే రద్దుచేయాలని డిమాండు చేస్తూ రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఏఐఎఫ్‌టియు(న్యూ) బందరు ఏరియా శాఖల ఆధ్వర్యంలో 16–2–15 తేదీన మచిలీపట్నం కలక్టరు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ "పాలకులు ఖజానాలో డబ్బు లేదనే పేరుతో, విద్యుత్, ఆయిల్ రంగాలు నష్టాలతో నడుస్తున్నాయనే పేరుతో ప్రజానీకంపై భారాలు మోపుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్, వ్యాట్ పన్నులను పెంచారని, విద్యుత్ ఛార్జీలను పెంచబోతున్నారన్నారు. 1261 కోట్లు వరకు విద్యుత్ ఛార్జీలు పెంచటంద్వారా మధ్యతరగతి, చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, కుటీర పరిశ్రమలవార్కి, చేతివృత్తులవార్కి, పంచాయితి, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్లలో వీధిదీపాలపై భారంమోపనున్నారన్నారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ నాయకుడు గద్దెనెక్కినా పరిస్థితిలో మాత్రం మార్పు వుండటంలేదని, కాబట్టి దళారీ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజానీకం అంతా ఆందోళనకు సిద్ధం కావాలని అన్నారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥జె.జగన్, కా॥ఈపూరి రాంబాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) బందరు ఏరియా నాయకులు కా॥ముచ్చు సుధాకరరావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా ఉపాధ్యక్షురాలు కా॥పామర్తి అంజమ్మ, ప్రజాతంత్ర చేనేత కార్మికసంఘం నాయకులు కా॥ పేరిశెట్టి విఘ్నేశ్వరరావులు మాట్లాడుతూ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ✡

Read ! Subscribe!!


Organ of Central Committee of CPI (ML)

పెరుగుతున్న సేద్యపు ఖర్చులు - పెరగని దిగుబడులు, లభించని న్యాయమైన ధరలు, కరువు, వరదల నష్టాలు - రుణాల ఊబిలో రైతులు

ఏ పాలక పార్టీ అధికారంలోకి వచ్చినా రైతాంగ వ్యతిరేక విధానాలనే అమలు జరుపుతున్నాయి. ఫలితంగా వారి ఏ మౌలిక సమస్య ఇంతవరకూ కూడా పరిష్కారం కాలేదు. అతివృష్టి–అనావృష్టి పరిస్థితులు, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటం, సేద్యపు ఖర్చులు పెరుగుతూ ఉండటంతోపాటు మార్కెట్ శక్తుల దోపిడీ రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నది.

దేశప్రజల ఆహార అవసరాలను తీర్చే రైతాంగాన్ని అన్ని విధాల ప్రోత్సాహపర్చి చేయూత నివ్వవలసిన బాధ్యత పాలకులపై ఉంది. మేలు రకమైన విత్తనాలు, సంస్థాగత రుణాలు, ఎరువులు, క్రిమిసంహారకమందుల ధరల నియంత్రణ, పంటలకు న్యాయమైన ధరలు, మార్కెట్ సౌకర్యం కల్పించటం పాలక ప్రభుత్వాల బాధ్యత. ఈ బాధ్యత పట్టని దేశ - రాష్ట్ర పాలకులు సామ్రాజ్యవాదుల, వారి బహుళజాతి సంస్థల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవసాయరంగాన్ని మార్చారు. దేశీయ విత్తనాలు అభివృద్ధి చేయటం ప్రక్కనబెట్టి బహుళజాతి సంస్థల హైబ్రిడ్, బి.టి. విత్తనాల దిగుమతే ధ్యేయంగా పెట్టుకున్నారు. ప్రతి సంవత్సరం వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని రైతాంగానికి కల్పించారు. అధిక దిగుబడుల కోసం ఎరువుల దిగుమతులు, ఆ విత్తనాల నుండి సంక్రమించే చీడపీడల కోసం పురుగుమందుల వాడకం ఎక్కువైంది. ఇవి వాడకుండా పంటలు పండని పరిస్థితికి భూసారం పడిపోయింది. ఫలితంగా సేద్యపుఖర్చులు విపరీతంగా పెరిగాయి. చీడపీడలు, వరదలు, తుఫాన్లను తట్టుకొని పండించిన పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకుండా పాలకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.

నామమాత్రపు దిగుబడులు

దేశంలోని వివిధ ప్రాంతాల, రాష్ట్రాల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా విత్తనాలు రూపొందించి, వాటిని అభివృద్ధి చేసి రైతాంగానికి అందించి, శాస్త్రీయ వ్యవసాయవిధానం ఎడల వారికి అవగాహన కల్పించి అధిక దిగుబడులు సాధించే విధంగా పాలకలు, రైతాంగానికి తోడ్పాటు అందించాలి. ఇలాంటి విధానం పాలకులకు అణుమాత్రం కూడా లేదు. మన దేశ వాతావరణ పరిస్థితులకు సరిపడని బహుళజాతి సంస్థల హైబ్రీడ్ విత్తనాలు, ప్రమాదకరమైన బి.టి. విత్తనాల సాగువైపు రైతాంగాన్ని బలవంతంగా మళ్లించారు. ఈ విత్తనాల సాగువలన పంట ఖర్చులు తగ్గి, అధిక దిగుబడులు వస్తున్నాయా! అంటే అదీ జరగటంలేదు. బి.టి. విత్తనాల కన్నా దేశీయ విత్తనాల వలనే అధికదిగుబడులు వచ్చాయని బి.టి. పత్తిసాగుపై జరిపిన అనేక సర్వేలు వెల్లడించాయి. మన ప్రక్క దేశాలతో పోల్చుకొంటే 68 సంవత్సరాల 'స్వతంత్ర' భారతదేశంలో పంట దిగుబడుల్లో ఎంత వెనుకబడి వున్నామో తెలుస్తుంది.

వరి, గోధుమ, అపరాల పంటల దిగుబడుల్లో భారత్‌కన్నా చైనా ఎంతో ముందు ఉంది. మనకన్నా ఎంతో వెనకబడి ఉన్న బంగ్లాదేవ్ మొక్కజొన్న దిగుబడులలో ఎంతో అభివృద్ధిని సాధించింది. పంటల దిగుబడులు కూడా తక్కువగా వుండి భారత రైతాంగానికి నష్టదాయకంగా మారింది.

పెరిగిపోతున్న సేద్యపు ఖర్చులు

రైతుల సేద్యానికి పెట్టుబడితోపాటు,విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కీలకంగా ఉన్నాయి. వీటి ధరలను నియంత్రించటం ద్వారా సేద్యపుఖర్చును అదుపులో ఉంచవచ్చు. దేశపాలకులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దేశీయ ఎరువుల విధానాన్ని, సహజసిద్ధమైన ఎరువుల వాడకాన్ని పక్కనబెట్టి విదేశీ కంపెనీల రసాయనక ఎరువుల వాడకం రైతాంగానికి తప్పనిసరి చేశారు. 2009 సం॥ వరకు ఎరువుల ధరలను కేంద్రప్రభుత్వం నిర్ణయించేది. ఆ తర్వాత ప్రపంచబ్యాంకు వత్తిడి ఫలితంగా ఎరువుల ధరల నిర్ణయాన్ని వాటి తయారీ కంపెనీలకే అప్పగించింది. ఇది కంపెనీలకు ఎంతో అనుకూలంగా మారింది. అధిక లాభాలు గడించేందుకు ఎరువుల ధరలను ఇష్టమొచ్చినట్లు పెంచుతూ ఉన్నారు. 2010–14 సంవత్సరాల మధ్య ఎరువుల ధరల పెరుగుదల ఈ విధంగా ఉంది. డిఏపీ 488–1248, 28–28–0 389–1398, 20–20–0 327–950, 14–35–14 425–1207 పెరిగాయి. ఇంకా అనేక ఎరువుల ధరలు పెరిగాయి. విత్తనాల ధరలను ప్రభుత్వం పెంచింది. 2011 సంవత్సరంలో వేరుశనగ క్వింటాల్ ధర 3900 రూ. ఉండగా 2014 నాటికి 4500 రూ. పెరిగింది. బి.పి.టి. వరి విత్తనాలు 1950 నుండి 2200 రూ. ఎంటియు 1010, 1001 విత్తనాలు 1850 నుండి 2100 రూపాయలకు, మొక్కజొన్న, జొన్న, ఆముదం ధరలు కూడా ఇలాగే పెరిగాయి. పురుగుమందుల వాడకం 2008–09లో 8,374 టన్నులు ఉండగా 2013–14 నాటికి వెయ్యి టన్నులకు పైగా చేరుకొంది. రాష్ట్ర రైతాంగం ఎకరాకి ఎరువుకు 2800, పురుగుమందులకు 4000 రూ. ఖర్చు చేస్తున్నారు. 2011 నుండి 2014 సం॥ల్లో పురుగుమందుల ధరలు 15 నుండి 20% పెరిగాయి. రెండు వేల కోట్ల రూపాయల పురుగుమందులను రాష్ట్ర రైతాంగం కొనుగోలు చేస్తున్నారు.

నిరంతరం పెరుగుతున్న ఎరువులు, క్రిమి సంహారక మందుల ధరలతోపాటు డీజిల్ ధర పెరగటం వలన సేద్యపుఖర్చులు పెరిగి రైతాంగానికి భారంగా మారింది. 1952లో ఎకరం వరి సేద్యానికి రైతులు 156 రూ. ఖర్చు చేస్తే నేడు 22 వేల రూపాయలకు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. కౌలుదారులకైతే అదనంగా 10 నుండి 20 వేల వరకు ఖర్చు చేయాలి. పత్తి సేద్యానికి 1963–70 సం॥ల మధ్య హెక్టారుకు ఖర్చు 3,500 రూపాయలు కాగా నేడు ఎకరానికే 32 వేల రూపాయలు ఖర్చు అవుతున్నది. చెరకు పంటకు 62 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. మొక్కజొన్నకి కి. 2000 సం॥లో 10 వేలు ఖర్చు కాగా 2014 లో 24 వేల దాకా ఖర్చు చేశారు. 2010లో వేరుశనగకు 11,269 రూ. పెట్టుబడి కాగా 2014 నాటికి 17 వేల వరకు చేరుకొంది. ఇలాగే సోయాబిన్, ప్రొద్దుతిరుగుడు, కందులు, శనగలు, జొన్న, మినుములు మొదలైన పంటల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పెరిగిన సేద్యపు ఖర్చులు రైతాంగానికి భారంగా మారింది.

తగ్గుతున్న సబ్సిడి

దేశంలో రైతాంగానికి అందే సబ్సిడీ ప్రధానంగా ఎరువు ద్వారానే. విత్తనాలపై లభించే సబ్సిడీ పరిగణలోకి రాదు. అధిక దిగుబడుల కోసం 1966లో దేశంలో సస్యవిప్లవాన్ని ప్రారంభించినట్లు పాలకులు ప్రచారంచేశారు. అమెరికా సామ్రాజ్యవాదుల సూచనల మేరకే దీన్ని పాలకులు ప్రారంభించారన్న విషయాన్ని గమనించాలి. అధికదిగుబడుల కోసం ఎరువులు వినియోగించాలనే సాకుతో అమెరికా నుండి ఎరువుల దిగుమతులు పెద్ద ఎత్తున దేశంలోకి వచ్చిపడ్డాయి. ఎరువుల కొనుగోలుపై రైతాంగానికి సబ్సిడి యిచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ భారతదేశానికి ఆర్థిక సహాయం ప్రకటించింది. 1970 నుండి ఎరువులపై సబ్సిడీ ఇవ్వటం ప్రారంభమైంది. రసాయనక ఎరువులు వాడందే దేశంలో పంటలు పండని పరిస్థితి ఏర్పడిన తర్వాత, వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టడానికి అమెరికా సూచనల మేరకు భారత రైతులకు ఇస్తున్న సబ్సిడీని క్రమంగా తగ్గిస్తూ పూర్తిగా ఎత్తివేయాలని పాలకులపై ప్రపంచ బ్యాంకు వత్తిడి ప్రారంభించింది. అందుకు అంగీకారం తెలుపుతూ సబ్సిడీని పాలకులు తగ్గిస్తూ వచ్చారు ప్రపంచ వ్యవసాయ ఒడంబడిక ప్రకారం అన్ని దేశాలు సబ్సిడీని తగ్గింపు చేయాల్సి ఉంది. ఒప్పందం ప్రకారం వెనుకబడిన దేశాలు సబ్సిడీలను తగ్గించాలంటున్న అమెరికా, తూర్పు యూరప్ దేశాలు అందుకు భిన్నంగా దొడ్డిదారిన గ్రీన్‌బాక్స్ పేరుతో పెద్దఎత్తున వారి దేశాల రైతాంగానికి సబ్సిడీలు అందచేస్తున్నారు. అమెరికా–యూరోపియన్ యూనియన్ దేశాల్లోని రైతులకు అందుతున్న సబ్సిడీని గమనిస్తే భారత రైతులకు అందే సబ్సిడీ సముద్రంలో నీటి బొట్టు లాంటిది. 1999లో ఆయా దేశాల ఒక్కోరైతుకు–భారత రైతుకు అందిన సబ్సిడీ ఈవిధంగా ఉంది. కెనడా 5,40,000 రూ., యూరోపియన్ యూనియన్ 10,20,000, జపాన్ 15,60,000, అమెరికా 12,60,000, ఓయిసిడి 6,60,000 ఉండగా భారత రైతులకు మాత్రం 3960 మాత్రమే సబ్సిడీ లభించింది. ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు దీన్ని కూడా తగ్గించే చర్యలకు ఎన్‌డిఏ ప్రభుత్వం పూనుకొన్నది. ఎకరా సేద్యంలో ఎరువులకోసం రైతులు 5600 రూ. ఖర్చు అవుతుంది. అందులో సగం (2800) ప్రభుత్వం సబ్సిడీగా యిస్తున్నది. 2012 వరకు అన్నిరకాల ఎరువులపై సబ్సిడీ యిచ్చిన పాలకులు, దాన్ని తగ్గించుకోవటానికి పోషకాలను బట్టి సబ్సిడీని ప్రకటించి కోట్ల రూపాయలను తగ్గించుకొన్నారు. పరోక్షంగా కంపెనీలకు సబ్సిడీ చెల్లించే విధానానికి స్వస్తిచెప్పి నగదు బదిలీ పథకం పేరుతో నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసే ఆలోచనతో హెక్టారుకి ఏడువేలు సబ్సిడీ యిస్తానంటున్నారు. ఇది అమలులోకి వస్తే ఎరువుల రేట్లు ఎంత పెరిగినా, సబ్సిడీ ఆమేరకే ఇవ్వటం వలన రైతాంగానికి ఎరువుల ఖర్చు పెరుగుతుంది. 1995 సం॥లో అమెరికా యిచ్చిన సబ్సిడీ 61 బిలియన్ డాలర్లు కాగా నేడు 140 బిలియన్ డాల్లకు చేరుకొంటే భారత్‌లో మాత్రం రైతాంగానికి యిచ్చే సబ్సిడీ తగ్గించేందుకు ఎన్‌డిఏ ప్రభుత్వం సిద్ధమౌతున్నది. ఫలితంగా భారత రైతు సేద్యం మరింత భారంగా మారనున్నది.

దేశాల మధ్య పంటల దిగుబడుల వ్యత్యాసం			
పంట	అత్యధిక ఉత్పత్తి సాధిస్తున్న దేశం	ఆ దేశంలో ఎంత (కిలోలు–హెక్టారుకు)	భారతదేశంలో (కిలోలు–హెక్టారుకు)
వరి	చైనా	6,548	3,264
గోధుమలు	చైనా	4,748	3,264
మొక్కజొన్న	బంగ్లాదేశ్	5,837	1,958
అపరాలు	చైనా	1,567	694

ఆధారం : ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ

పంటలకు న్యాయమైన ధర ప్రకటించని పాలకులు

పంట భూమి చుట్టూ రైతు కుటుంబం తిరుగుతూ ఉంటుంది. భూమి ద్వారా లభించే ఆదాయమే రైతుల కుటుంబాలకు జీవనాధారం. సంవత్సరం పొడవునా ఆ ఆదాయంపైనే కుటుంబం బ్రతకాలి. ఈ పరిస్థితిని అర్థం చేసుకొని రైతాంగం పండించే పంటలకు అయ్యే ఖర్చు, కుటుంబ పోషణకు కావాల్సిన కనీస అవసరాలు తీరే విధంగా వారు పండించే పంటలకు న్యాయమైన ధరలను ప్రభుత్వం ప్రకటించాల్సి వుంది. మార్కెట్ శక్తుల, దళారుల దోపిడీ నుండి రైతాంగాన్ని కాపాడి వారికి సరైన ధరలు లభించేలా కనీస మద్దతు ధరలను ప్రకటిస్తామని చెప్పిన పాలకులు, రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా ఇంతవరకు మద్దతు ధరలు ప్రకటించలేదు. నిత్యం పెరుగుతున్న సేద్యపు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు ఉండటం లేదు. వరికి పెరిగిన సేద్యపు ఖర్చులను గమనిస్తే ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర రైతాంగానికి నష్టదాయకంగా మారింది.

పెరిగిన సేద్యపుఖర్చులు, నిత్యజీవితావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని 2012–13 సం॥లో వ్యవసాయశాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన మద్దతు ధరలు (క్వింటాల్‌కి) ఈ విధంగా ఉన్నాయి. వరి ఏ గ్రేడ్ 2,135, వరి సాధారణ 2,102, వేరుశనగ 5,543, కంది 6,066, మినుము 5,544, పెసర 5,691, సోయాబిన్ 3,086, పత్తి, 6,836, ప్రొద్దుతిరుగుడు 5,559 రూపాయలుగా ఉంది. కేంద్రప్రభుత్వం వ్యవసాయశాఖ సిఫార్సులను ఏ మాత్రం పట్టించుకోకుండా నామమాత్రపు పెంపుదలతో సరిపెట్టింది. 2013–14 సీజన్‌లోనూ, 2014–15 వ్యవసాయ సీజన్‌లో కూడా వ్యవసాయశాఖ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధరలను ప్రభుత్వం ప్రకటించలేదు. 2014–15 సంవత్సరంలో వివిధ పంటల మద్దతు ధరలు ఈవిధంగా ఉన్నాయి. వరి మేలు రకం (క్వింటాల్) 1400, సాధారణం 1360, పత్తి 4,050, చెరకు 2,220, మొక్కజొన్న 1120, శనగలు 3,100, మినుములు 2,600 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించింది. పెరిగిన పంట ఖర్చులను దృష్టిలో పెట్టుకొంటే చాలా పంటలకు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంది. చెరకు, వరిలాంటి కొన్ని పంటలకు నామమాత్రం మిగులు ఉన్నా కుటుంబ అవసరాలకు సరిపోదు. కౌలు రైతులకు మిగులు అనేది ఎండమావిగానే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సేద్యానికి చేసిన అప్పుతోపాటు, కుటుంబ అవసరాలకు రైతాంగం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడి, రుణ ఊబిలో కూరుకుపోయి బయటపడేందుకు కొట్టుమిట్టాడుతున్నారు.

దుర్భిక్షం - వరదలు

గత ఐదు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు దుర్భిక్షం, వరదలు, తుఫాన్లకు గురౌతూ పంటలు కోల్పోయి రైతాంగం అపారంగా నష్టపోయారు. 2014 సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడి లక్షలాది ఎకరాల్లో సేద్యం జరుగలేదు. సేద్యం జరిగినచోట కూడా వర్షాలు కురవక, నీరు లేక పంటలు ఎండిపోయాయి. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, విజయనగరం జిల్లాల్లోని అనేక ప్రాంతాలు దుర్భిక్ష ప్రాంతాలుగా మారాయి. రాష్ట్ర వ్యాపితంగా నమోదు కావాల్సిన వర్షపాతంలో 33 శాతం తక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్‌లో వచ్చిన హుదూద్ తుపాన్ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలను అతలాకుతలం చేసింది. లక్షలాది ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోయారు. తెలంగాణ రాష్ట్రంలో తీవ్రదుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు కురవక, సేద్యపునీరు అందక, నీటిపంపులకు కరెంటులేక లక్షలాది ఎకరాల్లో సేద్యం సాగక, వేసిన పంటలు ఎండి రైతులు పెట్టిన పెట్టుబడి కోల్పోయారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో దుర్భిక్ష పరిస్థితులు తీవ్రరూపందాల్చినా ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని తక్కువ కాలంలో పంటకొచ్చే వంగడాలను, పశువుల మేతను, మంచినీరు అందించేందుకు, నిత్యజీవితావసర వస్తువులను అందుబాటులో ఉంచి సబ్సిడీ రూపంలో ఇచ్చేందుకు, కరువు పనులు కల్పించేందుకు ముందు జాగ్రత్త చర్యలేవీ తీసుకోలేదు. కరువు వలన ఉపాధి లేక, కుటుంబం గడవక మరో మార్గం లేక లక్షలాదిమంది గ్రామీణ ప్రజలు కడుపు నింపుకోవటానికి వలస బాట పడుతున్నారు.

అనంతపురం జిల్లాలో దుర్భిక్ష పరిస్థితులతో చెరువులు, కుంటలు ఎడిపోయి తాగేందుకు నీరు దొరకడంలేదు. పొల్లాలో ఎక్కడా పచ్చిక కన్పించటం లేదు. పశువులకు, మేకలకు పశుగ్రాసం లేక దాన్ని కొకలేక వాటిని తెగనమ్ముకొంటున్నారు. అనంతపురం, గోరంట్ల మార్కెట్ యార్డుల్లో పశువుల అమ్మకం, కొనుగోళ్ళు జరుగుతూ ఉంటాయి. ప్రస్తుతం ఈ మార్కెట్‌లు పశువులు, మేకలతో కిటకిటలాడు తున్నాయి. కేరళ, తమిళనాడు, కర్ణాటక, హైద్రాబాద్‌ల నుండి వచ్చిన వ్యాపారులు పశువులను కొనుగోలు చేసి లారీల్లో తరలించుకుపోతున్నారు. వీటిల్లో ఎక్కువ భాగం కబేళాలకు తరలించబడుతున్నాయి. బోర్లు ఎండిపోయి నీటిపంపుల్లో నీరురాక మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ట్యాంకర్ల ద్వారా అందించే నీరు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతున్నాయి. పనులు లేక వేలాదిమంది ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు.

పెరుగుతున్న వలసలు

చిత్తూరు జిల్లాలో కరువు వలసలతో గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయి. వ్యవసాయ పనులు లేక, ఉపాధిహామీ పథకం క్రింద పనులు చేపట్టక పోవడంతో రెక్కాడితేగాని డొక్కాడని రైతుకూలీలు, పేద రైతులు సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారు. తంబళ్ళపల్లె, మదనపల్లె, పుంగనూరు, ఓలేరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల నుండి లక్ష కుటుంబాలు వలస వెళ్లినట్లు పత్రికలు ఘోషిస్తున్నాయి. ఒక్క కుప్పం నియోజకవర్గం నుండే 15 వేల కుటుంబాలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారు. **కడపజిల్లాలో** రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, సుండుపల్లి, సంబేపల్లి మొదలగు మండలాల నుండి ఎక్కువగా పేదలు వలసలు వెళ్లారు. గాలివీడు, సుండుపల్లి మండలాల్లోని ఎక్కువ తండాలు ఖాళీ అయ్యాయి. నివాసం లేని ఫలితంగా కొన్ని గృహాల తలుపులకు చెదలు పట్టాయి. **కర్నూలు జిల్లా** నుండి హైద్రాబాద్‌కి వెళ్లే బస్సుల్లో వలసవెళ్లేవారే →

మిర్చి తొడియాలు తీసే మహిళా కార్మికుల కూలిరేట్ల పెంపుకోసం ఆందోళన

గుంటూరులో మహిళా కార్మికుల ఆందోళన

గుంటూరు మిర్చియార్డు పరిసర శ్రామికపేటల లోని; గుంటూరు రూరల్ మండల గ్రామాలలోని వేలాదిమంది శ్రామిక మహిళలు యార్డు సమీపంలోని వివిధ గూడేలలో మిర్చి తొడియాలు తీసే కార్మికులుగా పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. 2-2-2015న గూడెం యజమానులు (మిర్చి ఎగుమతిదారులు) అందరూ కలిసి ఈ తొడియాలు తీసే మహిళా కార్మికుల కూలిరేట్లను తగ్గిస్తూ నోటీసు ప్రతి గూడెంవద్ద అంటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి పెంచుకుంటూపోతున్న నిత్యావసరాల ధరలు ఈ శ్రామికకుటుంబాలపై పెనుభారాలను మోపుతుంటే ఈ ధరల కనుగుణంగా కూలిరేట్లను పెంచాల్సింది పోయి-ఈ మహిళా కార్మికుల శ్రమలవలనే, శ్రమలపైనే ఆధారపడి ఆదాయాలు గడిస్తున్న యాజమాన్యాలు (ఎగుమతిదారులు) వారి కూలీరేట్లను తగ్గించివేయటం అత్యంత అన్యాయం. తమ శ్రమలను మరింత దోపిడీ చేస్తూ తమ కుటుంబపరిస్థితులని మరింతగా దుర్భరంగా మార్చపూనుకున్న ఈ గూడేల యాజమాన్యాల (ఎగుమతిదారుల) నిరంకుశ దోపిడీ విధానాలపై మహిళా కార్మికులలో సంవత్సరాల తరబడి నివురుగప్పిన నిప్పులా రగులుతున్న నైరాశ్యం-తమ కూలిరేట్లను మరింత తగ్గించటంతో ఒక్కసారి పెను ఆగ్రహంగా బ్రద్ధలై యాజమాన్యాల చర్యలను ధిక్కరిస్తూ రోడ్డుపైకి వచ్చారు.

క్యాలిటీ పేరు	2013-14లో ఇచ్చిన రేట్లు (కిలోకు) (రూపాయలలో)	యజమానుల అసోసియేషన్ 1.2.15న ప్రకటించినరేట్లు (రూపాయలలో)	చర్చల తర్వాత యాజమాన్యాలు ప్రస్తుతం ఇస్తామన్న కూలిరేటు (రూపాయలలో)	గత సీజన్‌కు ఈ సీజన్‌కు రేట్ల మధ్య వ్యత్యాసం (రూపాయలలో)
తేజ	25	18	20	5
బ్యాడిగి	13	10	12	1
273	15	9	10	5
334	15	9	10	5
డిడి	13	9	10	3
నెం.5	10	8	9	1
341	11	8	9	2

చాలీచాలని కూలిరేట్లతోపాటు, గుమస్తాల అదిరింపులకు యజమానుల బెదిరింపులకు, తూకంలో మోసాలకు మహిళా కార్మికులు గురవుతున్నారు. అలాగే పని ప్రదేశాలలో త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక ప్రమాదకరమైన, అవమానకరమైన పరిస్థితులను అనుభవించుతున్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మిర్చి కోరులో ఒకరితో ఒకరు పోటీపడుతూ, కూర్చున్నచోటునుండి కదలకుండా విరామం లేకుండా యంత్రాలలా పనిచేయడం వలన ప్రమాదకరమైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. నడుంనొప్పి, గుండెనొప్పి, కీళ్ల అరుగుదల, రక్తహీనత, కిడ్నీవ్యాధులు, అల్సర్లు, డస్ట్‌అలర్జీ, చర్మవ్యాధుల వంటివి దీర్ఘకాలికంగా ఈ మహిళా కార్మికులను పట్టిపీడిస్తున్నవి.

ఈ నేపథ్యంలో యజమానులు (ఎగుమతి దారులు) నిర్ణయించిన తగ్గింపు రేట్లపై మహిళలంతా సుమారు 3 గంటలపాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేయగా 'రేట్లను కొంత పెంచటానికి అంగీకరించినప్పటికి, గత సీజన్ రేట్లతో పోల్చితే కొంత కోతపెట్టారు. **(పట్టిక చూడండి)**

యజమానులందరూ కలసి సీజన్‌లో ఇచ్చే కూలిరేటులో కిలోకి రు. 3/- నుండి రు. 5/- వరకు అన్‌సీజన్‌లో తగ్గిస్తారు

ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ గుంటూరుజిల్లా మిర్చి తొడియాలు తీసే కార్మికుల సంక్షేమ ఆధ్వర్యంలో కూలీరేట్లు, కనీసవసతుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు సాగించారు. ఈ కార్యక్రమాలకు ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కామ్రేడ్స్ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, యు.కృష్ణ, డి.వెంకటస్వామి నాయకత్వం వహించగా జయమ్మ, మైమూన్, మునెమ్మ, కుమారి, సుశీలమ్మ, లక్ష్మి, శేషారత్నం తదితర మహిళా కార్మికులు నాయకత్వం వహించారు. ✡

జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

1.	ప్రచురణ స్థలం	:	విజయవాడ, 520 010
2.	ప్రచురణ కాలం	:	పక్షానికొకసారి (పక్ష పత్రిక)
3.	ముద్రాపకుని పేరు	:	పి.జస్వంతరావు
	జాతీయత, చిరునామా	:	భారతీయుడు 32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్, మొగల్రాజపురం, విజయవాడ-520 010
4.	ప్రచురణ కర్త పేరు, జాతీయత, చిరునామా	:	పై విధంగానే
5.	సంపాదకుని పేరు	:	పి.జస్వంతరావు
6.	భాగస్వాములు	:	-

పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థములు

5.3.2015 సం|| పి.జస్వంతరావు

కార్మికులను... (8వపేజీ నుండి)

ఏఐఎఫ్‌టియు(న్యూ) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి కా|| కొలిపాక కిషన్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు పనిభద్రత కల్పించాలని, వివిధ రంగాల లోని అసంఘటిత కార్మికులకు బీమా, పి.ఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలను రద్దుచేసి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంకా, ఈ సదస్సులో ఏఐఎఫ్‌టియు(న్యూ) కేంద్ర కార్యవర్గసభ్యులు కా||గణేష్‌పండా, అడ్వకేట్ వి.లక్ష్మీనరసయ్య, తెలంగాణా రైతుకూలీసంఘం రాష్ట్రకార్యదర్శి కా|| భూతం వీరన్న, మహిళానాయకులు కా|| చిగురు రాజమణి, నవయువసమాఖ్య రాష్ట్ర నాయకులు కా||బామండ్ల రవీందర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సదస్సులో కరీంనగర్ గ్రానైట్ క్వారీ కార్మికులపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, కార్మికులపై దాడిచేసిన యజమానులపై కేసులు పెట్టాలని; తొలగించిన టిసిఎస్ ఉద్యోగులను తిరిగి విధులలోకి తీసుకోవాలని; రోడ్డురవాణా భద్రతా బిల్లు - 2014ను ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వ భూసేకరణ ఆర్డినెన్స్‌ను రద్దుచేయాలని, చేనేత కార్మికుల రుణమాఫీ చేయాలని, ప్రైవేటు కార్పొరేటు సంస్థలలో రిజర్వేషన్లను అమలుచేయాలని, హిందుస్తాన్ కేబుల్ లిమిటెడ్స్ పరిశ్రమను, వరంగల్లు జిల్లాలోని రేయాన్స్ పరిశ్రమను వెంటనే తెరచి కార్మికులకు జీతాలు చెల్లించాలని, పని ప్రదేశాలలో పనిచేస్తున్న కార్మికులు ప్రమాదాలకు గురై మరణిస్తే ఆయా యాజమాన్యాలను బాధ్యులను చేయాలని, కార్మిక కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పలుకార్మిక సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు. ✡

➔ ఎక్కువగా ఉన్నారు. వీరు భవన నిర్మాణ కార్మికులుగా, దుకాణాల్లో పనిచేసేవారుగా, అపార్ట్‌మెంట్లలో వాచ్‌మన్‌లుగా పనిచేస్తున్నారు. స్త్రీలు కూలిపనులకు, సంపన్నుల ఇండ్లలో పాచిపనులు చేస్తున్నారు. **అనంతపురం జిల్లాలో** 60 వేల కుటుంబాలు వలసలు వెళ్ళినట్లు అధికారులు అంచనా వేశారు. కదిరి నియోజకవర్గం నల్లచెరువు మండలంలోని 110 కుటుంబాలకుగాను 76 కుటుంబాలు నగరాలకు వలస వెళ్లారు. **శ్రీకాకుళం జిల్లా** లోని టెక్కలి, ఇచ్ఛాపురం, రాజాం, పాతపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుండి లక్షమంది వలస వెళ్ళినట్లు అంచనాగా ఉంది. కరువుకాటకాలతోపాటు హుదూద్ తుఫాన్ వలసలను పెంచింది. **విజయనగరం జిల్లాలో** 55 వేల మంది విజయవాడ, గుడివాడ, ఏలూరు, విశాఖపట్నం, రాజమండ్రి, హైద్రాబాద్, చెన్నై, బెంగుళూరు, కోయంబత్తూరు, గుజరాత్ ప్రాంతాలకు పనులకోసం వలసలు వెళ్లారు. **ప్రకాశం జిల్లా** నుండి లక్షమంది వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్లారు. ఎక్కువమంది భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి, కొండాపురం, కావలి, దక్కిలి, బోగోలు, అల్లూరు, సీతాపురం తదితరప్రాంతాల నుండి 25 వేలమంది పొట్టకూటికోసం వలసబాట పట్టారు. పాడిపంటలతో కళకళలాడిన పల్లెలు నేడు వలసలతో బోసిపోతున్నాయి. **కృష్ణాజిల్లాలో** నూజివీడు, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట తదిరత నియోజకవర్గాల నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు అధికారులు అంచనావేశారు. **గుంటూరు, తూర్పు గోదాదరి, పశ్చిమగోదావరి జిల్లాల** నుండి కూడా ఈ సంవత్సరం ప్రజలు వలస బాట పట్టారు.

ప్రాణాలు కోల్పోతున్న రైతాంగం

సేద్యపుఖర్చులు పెరగటం, దిగుబడులలో ఆశించినవిధంగా ఎదుగుదల లేకపోవటం, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవడం, కరువులు, వరదల వలన పంటలకు అపారనష్టం వాటిల్లటం వలన రైతాంగం అప్పులపాలై, అవి తీర్చేందుకు ఉన్న ఆస్తులు అమ్మినా వాటినుండి బయట పడలేక, వడ్డీవ్యాపారులు, బ్యాంక్ అధికారుల వేధింపులు, అవమానాలతో ఆత్మగౌరవం చంపుకొని బ్రతకలేక బలవంతంగా ప్రాణాలు తీసుకోవాల్సిన పరిస్థితులను రైతాంగానికి పాలకులు కల్పించారు. 1995-2013 సం|| మధ్యకాలంలో దేశ వ్యాపితంగా 2,96,466 మంది రైతులు బలవంతపు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 37,913 మంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు. 2013లో మహారాష్ట్రలో అత్యధికంగా 3,146 మంది ఆత్మహత్యలు చేసుకోగా, 2014 మందితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండవస్థానంలో ఉంది. ఇంకా ఇలాంటి మరణాలు ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జరిగాయి. 2014 జూన్‌లో రాష్ట్రం విడిపోయి ఆంధ్ర-తెలంగాణా రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత కూడా రెండు రాష్ట్రాల్లోనూ ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనేంది. తెలంగాణా రాష్ట్రలో 500 మంది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 100 మందికిపైగా అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశంలో 60 శాతం మంది రైతులు రుణగ్రస్తులుగా ఉండగా ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో 82% మంది అప్పుల్లో కూరుకుపోతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడించటం రాష్ట్రంలో రైతాంగపు సంక్షోభానికి అద్దంపడుతున్నది.

కరువు - రైతుల ఆత్మహత్యలను పట్టించుకోని పాలకులు

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా రాష్ట్రాల్లో కరువు, ఆత్మహత్యల పరంపర కొనసాగుతుంటే రెండు ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభలో కరువు పరిస్థితులను చర్చించాలంటే రాష్ట్రంలో కరువు ఎక్కడ ఉందంటూ చర్చకే అనుమతించలేదు. వార్తాపత్రికలతోపాటు అనేక సంఘాలు ఎక్కడెక్కడ ఎలాంటి కరువు పరిస్థితులు ఉన్నాయన్న వాస్తవాలను వెల్లడించటంతో చంద్రబాబు ప్రభుత్వం గత్యంతరంలేని పరిస్థితుల్లో దుర్భిక్ష పరిస్థితులను అంగీకరించి 226 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఇది కూడా కరువు పరిస్థితిని తక్కువ చేసి చెప్పటమే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 664 మండలాలు ఉన్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ పేర్కొన్న వర్షపాతం ప్రకారం 563 మండలాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఉంటే 226 మండలాలనే కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం ఉద్దేశ పూర్వకంగా చేసిందే. తన పాలనలో దుర్భిక్ష పరిస్థితులు తగ్గాయని చెప్పుకోవడానికి, కరువు మండలాలను ఎక్కువగా ప్రకటిస్తే ఎక్కువ నిధులు కేటాయించవలసి వస్తుంది. వాటిల్లో ప్రత్యేక సహాయక చర్యలు, కరువు పనులు అమలు జరపాల్సి ఉంటుంది. అందుకే చంద్రబాబు ప్రభుత్వం కరువు నిధుల కేటాయింపుని తగ్గించుకోవటానికి కరువు మండలాలను తక్కువచేసి ప్రకటించింది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తటంతో మరికొన్నింటిని కరువు మండలాలుగా ప్రకటిస్తానంటున్నది.

రైతుల ఆత్మహత్యలను చంద్రబాబు ప్రభుత్వం అపహాస్యం చేస్తున్నది. 100 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోతే అప్పులుతీర్చలేక వారు చనిపోలేదని, కుటుంబ సమస్యలు, అనారోగ్య సమస్యల వలన చనిపోయారని, అప్పుల బాధతో అసలు రైతులు ఆత్మహత్యలు చేసుకోలేదని చంద్రబాబు ఆయన మంత్రివర్గ సభ్యులు ప్రచారం చేశారు. వారి ప్రచారం ఎడల తీవ్ర వ్యతిరేకత, అసహ్యత వ్యక్తంకావటంతో మాట మార్చి 30 మంది లోపు మాత్రమే అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకొన్నారని, వారికి పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ఇది కూడా రైతుల బలవన్మరణాలను తగ్గించి చూపటమే.

తెలంగాణ రాష్ట్రంలోనూ కె.సి.ఆర్. ప్రభుత్వం ఇలాంటి విధానాన్నే అనుసరించింది కరువు పరిస్థితులను, రైతుల బలవన్మరణాలను తక్కువచేస్తూ ప్రత్యర్థులపై దాడిచేస్తూ సమస్యను ప్రక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. రాష్ట్రంలో కరువు, రైతుల ఆత్మహత్యలకు ఆంధ్రాపాలకులే కారణమని ప్రజలను రెచ్చగొట్టేందుకు కె.సి.ఆర్. ప్రభుత్వం పూనుకొన్నది. సాగర్ కుడికాల్వ నీటి విడుదల వివాదాన్ని ఘర్షణలను రెండు ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా సృష్టించి ప్రజల ఆలోచనలను మళ్లించేందుకు పూనుకొన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం, తెలంగాణలో టి.ఆర్.ఎస్. ప్రభుత్వం రైతాంగం ఎదుర్కొంటున్న ఏ ఒక్క మౌలిక సమస్య పరిష్కారానికీ ప్రయత్నించటంలేదు. సేద్యపు ఖర్చులు తగ్గించటం, ఉత్పత్తులు పెంచటం, న్యాయమైన ధరలు కల్పించటం, సాగునీటి సౌకర్యం కల్పించటం ద్వారా కరువు, రైతుల బలవన్మరణాలను నివారించే విధానాలు చేపట్టటం లేదు. ఈ సమస్యల నుండి రైతాంగాన్ని ప్రక్కకు మళ్లించేందుకు రైతుల రుణమాఫీ, రాజధాని నిర్మాణం, స్వర్ణాంధ్రప్రదేశ్ చుట్టూ రైతాంగ ఆలోచనలను తెలుగుదేశం ప్రభుత్వం మళ్లిస్తుంటే, టి.ఆర్.ఎస్. ప్రభుత్వం బంగారు తెలంగాణ, ఆంధ్రా పాలకుల దోపిడీ అంటూ ప్రజల ఆలోచనలను మళ్లించే ప్రయత్నం చేస్తున్నది.

తెలుగుదేశం - టి.ఆర్.ఎస్. ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను అర్థం చేసుకొని రెండు రాష్ట్రాల్లోని రైతాంగం తమ మౌలిక సంస్యల పరిష్కారం కోసం పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ✡

'కార్మికులను నికృష్ట దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై, పాలకుల విధానాలపై సమరశంఖం పూరించండి'

తెలంగాణా రాష్ట్రసదస్సులో ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత ప్రధానకార్యదర్శి పి.కె.షాహీ పిలుపు

కరీంనగర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు; ఏఐఎఫ్‌టియు(న్యూ) తెలంగాణా రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ పి.కె. షాహి

కరీంనగర్, 22-2-15 :

ఏఐఎఫ్‌టియు(న్యూ) తెలంగాణా రాష్ట్రకమిటి ఆధ్వర్యంలో 22-2-15న తెలంగాణా రాష్ట్రస్థాయి కార్మికసదస్సు స్థానిక కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. సదస్సుకు ముందుగా గీతాభవన్ చౌరాస్తా నుండి కళాభారతివరకు రాష్ట్రంలోని పలుప్రాంతాల నుండి తరలివచ్చిన ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ సంఘాల కార్మికులు ప్రదర్శన నిర్వహించారు.

అనంతరం జరిగిన కార్మికసదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ మోడెం మల్లేశం, రాష్ట్ర నాయకులు కె. మల్లేష్, నున్న కృష్ణలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు.

సదస్సులో ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత ప్రధానకార్యదర్శి కా॥ పి. కె. షాహి ప్రధానవక్తగా హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న గత ఆరున్నర దశాబ్దాలపైగా కాలంలో పార్టీలు వేరైనా కేంద్రంలో, రాష్ట్రాలలో అధికారం చెలాయించిన వారంతా కార్మికులపై దోపిడీ అణచివేతలను తీవ్రం చేస్తూ వచ్చారని ఆయన పేర్కొన్నారు. ఎంతో అభివృద్ధిని సాధించామని పాలకులు చంకలు గుద్దుకుంటున్న ప్పటికీ దారిద్ర్యం, అనారోగ్యం, అవిద్య పెరిగి పోతూనే వున్నాయని, అవినీతి - కుంభకోణాలు, లంచగొండితనం, నల్లధనం తరలింపులకు అంతు లేకుండా వుందని, సామాజిక దురన్యాయాలు పెచ్చిమీరుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 1991 తర్వాత నుండీ పాలకులు అనుసరిస్తూవస్తోన్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు మరింత సంక్షోభంలోకి కూరుకు పోయాయని, ఫలితంగా కార్మికులు, రైతాంగం, రైతుకూలీలు, గ్రామీణ పేదల జీవనం మరింత దుర్భరంగా తయారైందన్నారు. ఈ దురవస్థలకు మూలమైన దోపిడీ వ్యవస్థ అంతానికి కార్మికవర్గం దీక్షపూనాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత అధ్యక్షులు కామ్రేడ్ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ ఇటీవల కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వం లోని ఎన్‌డిఏ పాలకులు, శతాబ్దాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నింటినీ తిరగదోడుతున్నారన్నారు. ఏమేరకైనా కార్మికులకు అండగా నిలచే కార్మిక చట్టాలన్నింటినీ సవరించి వేస్తున్నారని, బహుళజాతి-బడాకార్పొరేట్ పరిశ్రమ యాజమాన్యాల విచక్షణారహిత దోపిడీకి కార్మికులను బలిచేస్తున్నారని అంటూ, పాలకుల కార్మిక-ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) కేంద్ర కార్యవర్గ సభ్యులు కా॥ సి. పెద్దన్న మాట్లాడుతూ ఇటీవల కాలంలో కరీంనగర్ గ్రానైట్ గనుల యాజమాన్యం ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ క్వారీ సంఘం నాయకులపై భౌతిక దాడులకు పాల్పడి తీవ్రంగా గాయపరచటాన్ని నిశితంగా ఖండించారు. నూతనంగా తెలంగాణా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కెసిఆర్, గ్రానైట్ యాజమాన్యాల కొమ్ము గాస్తూ, దాడులకు పాల్పడిన వారికి వత్తాసుగా నిలుస్తున్నాడని, దాడులకు గురైన కార్మికులపైన, యూనియన్ నాయకులపైనే తప్పుడు కేసులు బనాయించటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥నల్లాన స్వామీరావు మాట్లాడుతూ బంగారు తెలంగాణాను నిర్మిస్తానంటూ అధికారాన్ని చేబట్టిన కెసిఆర్‌కు రాష్ట్రంలో రైతాంగ ఆత్మహత్యలు కన్పించటం లేదన్నారు. రాజధాని నిర్మాణం పేరిట ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రైతాంగ భూములను వేలఎకరాలు తీసుకోవటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

(తరువాయి 7వ పేజీలో)

రోడ్డు రవాణా భద్రతా బిల్లును ఉపసంహరించుకోవాలని కార్మికుల ఆందోళన - ఆటోల బంద్-ప్రదర్శన-ధర్నా

విజయనగరంలో బంద్ సందర్భంగా ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

విజయనగరం, 4-2-15 :

నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం రూపొందించిన రోడ్ రవాణా భద్రతాబిల్లు-2014ను ఉపసంహరించాలని, ఆటో డ్రైవర్లపై నిరంతరం పోలీసు ఆర్‌టిసి, రవాణా అధికారుల అన్నిరకాల వేధింపులు, జరిమానాలు, అక్రమ కేసులు అరికట్టాలని, పెరుగుతున్న ప్రయాణీకుల దృష్ట్యా కొత్త ఆటో స్టాండ్లు మంజూరు చేయాలని అదేవిధంగా ఆటో స్టాండ్లను రికార్డుల్లో నమోదు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బీమాపథకం అమలుచేయాలని, ఫైనాన్స్ సంస్థల ఆగడాలను నియంత్రించాలని డిమాండ్‌చేస్తూ ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో విజయనగరంజిల్లా విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ యిచ్చిన పిలుపు మేరకు 4-2-2015 తేదీ ఉదయం 6 గంటల నుండి ఆటోల బంద్ సంపూర్ణంగా జరిగింది. చుట్టుప్రక్కల గల నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, జామి, ఎస్.కోట, గంట్యాడ, గజపతినగరం, బొండపల్లి మండలాలతోపాటు విజయనగరం పట్టణ పరిసరాలలో కూడా ఆటోల బంద్ విజయవంతంగా జరిగింది. ఎక్కడ ఆటోలు అక్కడే ఆగిపోయాయి. విజయనగరం పట్టణంతోపాటు మరో 15 మండలాలు భోగాపురం పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, గంట్యాడ, ఎస్.కోట, కొత్తవలస, జామి మండలాల్లో ఆటోలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. చీపురుపల్లి, విజయనగరం వంటి చోట్ల ఆటోలతోపాటు టాటా మేజిసిక్‌లు, జీపులు కూడా బంద్‌కు సంఘీభావంగా నిలుపుచేశారు.

ఆటోల బంద్-భారీ ప్రదర్శన

విజయనగరం పట్టణంలో కనీవినీ ఎరుగని తీరులో ఆటోలతో భారీ ప్రదర్శన జరిగింది. బాల కళాకారుల ప్రజాకళాకారుల డప్పువాయిద్యాలు, నృత్యాలు, డప్పు డ్యాన్స్, జనం పాటలు ఆటో కార్మికుల నినాదాలతో కోట వద్ద నుండి ఉదయం 10-30 గంటలకు ఆటోకార్మికుల ర్యాలీ ఏఐఎఫ్‌టియు (న్యూ) ఆధ్వర్యంలో జిల్లా విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ నాయకత్వంలో వేలాది ఆటో కార్మికులతో సాగింది. మూడు లాంతర్లు, గంట స్తంభం, నాయుడు ఫంక్షన్‌హాలు సెంటర్లగుండా కలెక్టరు ఆఫీసు వరకు ర్యాలీ జరిగింది. విజయనగరం పట్టణంలో సుమారుగా 3000 వేల మందితో జరిగిన ప్రదర్శనలో 200వరకు ఆటోలు పాల్గొన్నాయి.

ప్రదర్శనగా కలెక్టరు ఆఫీసుకు చేరుకున్న వేలాది మంది ఆటోడ్రైవర్లు ప్రధాన గేటుముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాలకళాకారుల, డప్పు వాయిద్యకారుల పాటలు, డప్పుడ్యాన్స్‌లు, బాలల సుద్దులు నృత్య రూపకంతో, ఆటో డ్రైవర్ల నినాదాలతో, నాయకుల ఉపన్యాసాలతో కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది.

ఆటో ర్యాలీ ధర్నా కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥గణేష్ పండా ధర్నానుద్దేశించి మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల సంక్షేమానికి చిల్లిగవ్వకూడా కేటాయించని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం డ్రైవర్ల మెడలకు ఉరిత్రాళ్ళు తగిలించే ప్రయత్నం చేస్తుందని రోడ్ రవాణా భద్రతా బిల్లు చట్టరూపం ధరిస్తే రోడ్‌పై ఆటోను ఎవరూ నడపలేరని, 5 నుండి 7 సం॥ల జైలుశిక్షలు, లక్ష నుండి 3 లక్షల వరకు జరిమానాలు చెల్లించాలంటే సాధారణ ఆటోడ్రైవరుకు ఎలా సాధ్యమవుతుందని అందుకోసమే వృత్తి వదిలి పెడితే మొత్తం రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు, విదేశీ కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగమే ఈ బిల్లు అసలు ఉద్దేశమని దీన్ని త్రిప్పి కొట్టేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ఇంకా ఆటోయూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రెడ్డి నారాయణరావు, ఎన్. అప్పలరాజురెడ్డి, బి. శంకరరావు ఏఐఎఫ్‌టియు(న్యూ), బి. పాపారావు, ఎం. సన్యాసిరావు తదితరులు మాట్లాడారు.

అనంతరం ప్రతినిధిబృందం ఏజెసి నాగేశ్వరరావు గారిని కలిసి రాష్ట్రప్రభుత్వం ద్వారా కేంద్రానికి వినతి పత్రం, జిల్లా స్థాయిలో సమస్యలపై మరో వినతి పత్రం విడివిడిగా అందజేసింది. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కనకారావు, ఎన్‌వైఎస్ అధ్యక్షులు ఎం. అప్పలరాజు, రజక సంఘం నుండి సత్యారావు, పైడిరాజు, బాలకళాకారులు లక్ష్మి, ఇందు, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

బంద్ సన్నాహక కృషి

నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకున్న రోడ్‌రవాణా భద్రతా బిల్లు చట్టం రూపందాల్చితే రవాణా రంగం కార్పొరేట్ కంపెనీల, బహుళజాతి సంస్థల పరమయ్యే విధంగా ఈ బిల్లు రూపొందించారు. **(దీనిపై ప్రత్యేక వ్యాసం 5వ పేజీలో)** రవాణారంగ కార్మికులు దేశ వ్యాపితంగా వివిధ రూపాలలో ఈ బిల్లు ఆపాలని ఆందోళన చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల రవాణా (ప్రభుత్వాల) రంగ ఉద్యోగులు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాపితంగా సంఘటితమయ్యి నిరవధిక సమ్మెచేసే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ఈ బిల్లు ప్రమాదాన్ని గుర్తించి, ఈ బిల్లును బలంగా వ్యతిరేకించే విధంగా ఏఐఎఫ్‌టియు(న్యూ) అనుబంధ ఆటోవర్కర్స్ యూనియన్ కార్యక్రమాన్ని రూపొందించింది. జిల్లాలో ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను జోడించి మొత్తం ఆటో కార్మికుల్లోకి ఈ విషయాన్ని తీసుకువెళ్ళగలిగింది. యూనియన్ విస్తృత సమావేశం జరిపి బంద్, ర్యాలీ ధర్నా నిర్ణయం తీసుకుంది. సుమారు 10 మండలాల్లో ఆటో యూనియన్ నాయకులు, ఆటో కార్మికులతో సమావేశాలు జరిపి బంద్ ప్రాధాన్యతను వివరించారు. జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఆటోల బంద్, పక్కా ఆటోస్టాండ్లు ఇవ్వాలని, వేధింపులు ఆపాలని క్యాంపెయిన్ జరుగుతుండగానే పట్టణ సుందరీకరణ పేరిట మున్సిపల్ అధికారులు ఉన్న ఆటోస్టాండ్లను తొలగించే ప్రయత్నాలను చేశారు. ఈ నేపథ్యంలో ఆటోల బంద్‌కు పిలుపునిచ్చి 2, 3 తేదీలలో విజయనగరం సబ్ డివిజన్ అంతా ఆటోలో మైక్‌పెట్టి బంద్ ప్రచారం విస్తృతంగా చేపట్టారు. స్కూలు పిల్లల తల్లితండ్రులకు బంద్ ఆవశ్యకతను ఆటోడ్రైవర్ల ద్వారా వివరించడంతో స్కూళ్ళకు తిప్పే ఆటోలు కూడా ఉదయం 6 గంటల నుండీ సమ్మెలో పాల్గొన్నాయి. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010